Place your advertisements on website

https://rajadhanivartalu.com
call us at whatsapp

94406 62699

# రాజధాని వార్తలు

# RAJADHANI VARTALU

ఏపి రాజధాని అమరావతి రైతులు ఇప్పటికీ ప్రభుత్వం నుండి తమ వార్షిక కౌలు చెల్లింపుల కోసం ఎదురు చూస్తున్నారు. ప్రభుత్వం వారి వార్షిక కౌలు వీలైనంత త్వరగా చెల్లిస్తుందని ఆశిస్తున్నాను. ప్రభుత్వం మరింత ఆలస్యం చేస్తే అవి సరైన పద్ధతి కానే కాదు- పి.హుస్సేన్ ఖాన్, ఎం.ఎస్.సి. ఎడిటర్, రాజధాని వార్తలు

rajadhanivartalu@gmail.com
94406 62699

అమరావతి సంపుటి (Vol) : 7 సంచిక (Issue): 143 పేజీలు (Pages): 8 వెల: రూ. 2.00 ఆంధ్రప్రదేశ్ 'రాజధాని' తొలి తెలుగు దినపత్రిక (Andhra Pradesh Capital's First Telugu Daily)

బుధవారం, 7 - 1 - 2026

94406 62699 rajadhanivartalu rajadhaniv www.rajadhanivartalu.com RNI No.: APTEL/2019/77985 Postal regd: GTR/114/2025-27 స్థాపితం: 2015

## విధి నిర్వహణలో వైఫల్యం.. సీఏక్యూఎంపై సుప్రీంకోర్టు అసహనం



**న్యూఢిల్లీ:** దేశ రాజధాని ఢిల్లీ, పరిసర ప్రాంతాల్లో వాయు కాలుష్యం తీవ్రతపై సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. కమిషన్ ఫర్ ఎయిర్ క్వాలిటీ మేనేజిమెంట్ విధి నిర్వహణలో విఫలమైంది అంటూ అసహనం వ్యక్తం చేసింది. ఢిల్లీలో వాయు కాలుష్యంపై అత్యున్నత న్యాయస్థానం మంగళవారంనాడు విచారణ జరిపింది. ఃకాలుష్యానికి ప్రధాన కారణాలు గుర్తించారా? దీనిపై పబ్లిక్ డొమైన్‌లో చాలా ఆర్టికల్స్ వచ్చాయి. నిపుణులు తమ అభిప్రాయాలు చెప్పారు. ప్రజలు తమ అభిప్రాయాలు వెల్లడించారు. మాకు ఇంకా మెయిల్స్ వస్తూనే ఉన్నాయి అని సుప్రీం ధర్మాసనం పేర్కొంది. దేశ రాజధానిలో పెరుగుతున్న వాయు కాలుష్యానికి బస్సులు, ట్రక్కులు కారణమని చెప్పడం సులువేనని, అయితే వాటిని నిలిపివేస్తే ప్రజలు ఎలా ప్రయాణిస్తారని ప్రశ్నించింది. ఈనెల 2న సమావేశం ఏర్పాటు చేశామని, తాము తీసుకుంటున్న కీలక చర్యలపై రెండు నెలల్లో వివరాలు తెలియజేస్తామని సీఏక్యూఎం కోర్టుకు తెలియజేసింది. దీనిపై కోర్టు ఘాటుగా స్పందించింది. ఇది ఎంతమాత్రం ఆమోద యోగ్యం కాదని, సీఏక్యూఎం తమ విధుల నిర్వహణలో విఫలమైం దని ఆగ్రహం వ్యక్తం చేసింది. కాలుష్య సమస్యపై లోతైన విశ్లేషణ చేయాలని, ముందుగా ప్రధాన కారణాలను గుర్తించి, ఆ తర్వాత దాన్ని ఎదుర్కొనేందుకు సమర్ధవంతమైన పరిష్కారాలను కనుగొనాలని పేర్కొంది. సీఏక్యూఎం రెండు వారాల్లోగా నిపుణులతో సమావేశాన్ని ఏర్పాటు చేసి నానాటికీ దిగజారుతున్న వాయు కాలుష్యంపై తమకు నివేదిక సమర్పించాలని ఆదేశించింది. సమగ్ర నివేదికను ప్రజా క్షేత్రంలో ఉంచాలని స్పష్టం చేసింది.


## రాజధాని ప్రాంతంలోని కృష్ణా నదీ తీరాన్ని మెరీనాగా అభివృద్ధి చేయాలని ప్రతిపాదన

**అమరావతి, (రాజధాని వార్తలు):** ముఖ్యమంత్రి చంద్రబాబు అధ్యక్షతన ఏపీ సీఆర్డీఏ 57వ అథరిటీ సమావేశం. హాజరైన మంత్రులు నారాయణ, పయ్యావుల కేశవ్, సీఎస్ విజయానంద్, పురపాలక-సీఆర్డీఏ-ఆర్థిక శాఖల ఉన్నతాధికారులు. వివిధ అంశాలపై సీఆర్డీఏ అథరిటీ సమావేశంలో చర్చ. రైతులకు ఇచ్చిన రిటర్నబుల్ ప్లాట్లలో వీధి శూల ఉన్న 112 ప్లాట్లకు ప్రత్యామ్నాయ ప్లాట్ల కేటాయింపునకు అంగీకారం. రాజధానిలో భూమిలేని నిరుపేదలకు ఇచ్చే పెన్షన్లను ఆ కుటుంబంలో మైనర్లయిన అనాథలకు వర్తింప చేసేందుకు ఆమోదం. రాజధాని ప్రాంతంలోని కృష్ణా నదీ తీరాన్ని మెరీనాగా అభివృద్ధి చేయాలనే ప్రతిపాదనలను ఆమోదించిన అథరిటీ. వాటర్ ఫ్రంట్, జెట్టీలు, టూరిజం లీజర్



బోట్లు, ఫుడ్ ప్లాజాలు, ల్యాండ్ స్కేప్ పనులను పీపీపీ విధానంలో చేపట్టేందుకు టెండర్లు పిలవాలని నిర్ణయం. ఏపీ సీఆర్డీఏలో 754 పోస్టుల ర్యాటిఫికేషన్‌కు ఆమోదం.

## 'మీ పని అద్భుతం'.. మంత్రులు, అధికారులకు సీఎం కితాబు



**అమరావతి, (రాజధాని వార్తలు):** 2025 ఏడాదిలో పెట్టుబడులు అద్భుతంగా వచ్చాయని... అదే ఉత్సాహంతో 2026లో పనిచేయాలని మంత్రులు, అధికారులకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సూచించారు. మంగళవారం నాడు సచివాలయంలో సీఎం అధ్యక్ష తన 14వ ఎస్ఐపీబీ (రాష్ట్ర స్థాయి పెట్టుబడుల ప్రొత్సాహక బోర్డు) సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ.. రాష్ట్రాభివృద్ధికి మంత్రులు, అధికారులు అద్భుతంగా పని చేశారంటూ కితాబిచ్చారు. గత ప్రభుత్వ పాలనలో పోయిన బ్రాండ్ తిరిగి వచ్చిందని.. రాష్ట్రానికి పెద్ద ఎత్తున పెట్టుబడులు వచ్చాయన్నారు. భారీ పరిశ్రమలు ఏపీలో పెట్టుబడులు పెడుతున్నాయని తెలిపారు. టాటా, జిందాల్, బిర్లా, అదానీ, రిలయన్స్, టీసీఎస్, కాగ్నిజెంట్ వంటి ప్రముఖ సంస్థలు ఏపీలో పెట్టుబడులు పెట్టాయని సీఎం అన్నారు. ఏ చిన్న పొరపాటు తావివ్వకుండా మంత్రులు, అధికారులు బాధ్యత తీసుకోవాలని సూచించారు.

**నాకు చాలా సంతోషాన్నిచ్చింది..**

2025లో అంతా కలిసి టీమ్ వర్క్ చేశామని... అందుకే మంచి ఫలితాలు వచ్చాయని అన్నారు. విద్యుత్ రంగంలో అద్భుతంగా పనిచేశామన్నారు. 13 పైసలు విద్యుత్ ఛార్జీలు తగ్గించామని సీఎం వెల్లడించారు. రూ. 4500 కోట్ల ట్రూఅప్ ఛార్జీల భారాన్ని ప్రజలపై వేయకుండా ప్రభుత్వమే భరించాలని నిర్ణయించామన్నారు. విద్యుత్ కొనుగోళ్ల ధరలను కూడా తగ్గించేలా ప్రణాళికలు రూపొందిస్తున్నామని తెలిపారు. ప్రజలపై విద్యుత్ ఛార్జీల భారం పడకుండా చూడడం తనకు చాలా సంతోషాన్నిచ్చిందని అన్నారు. విద్యుత్ రంగంలో ప్రభుత్వం చేసిన కృషి వల్లే డేటా సెంటర్లు వచ్చాయని సీఎం తెలిపారు.

**అది లోకేష్ కృషే..**

విద్యుత్ రంగంతో పాటు వివిధ రంగాల్లో పెట్టుబడులు బాగా వచ్చాయన్నారు. దావోస్ సదస్సుకు వెళ్లామని.. ఏపీ బ్రాండ్ ప్రమోట్ చేయగలిగామని అన్నారు. అలాగే విదేశీ కంపెనీలను ఆకర్షించ గలిగామని సీఎం తెలిపారు. గూగుల్ సెంటర్ ఏపీకి తీసుకు రావడానికి లోకేష్ కృషి చేశారని తెలిపారు. ప్లస్ ఇచ్చే కిక్ అద్భుతంగా ఉంటుందని... ఆ కిక్ కోసం అందరూ పని చేయాలని సూచించారు. స్పీడ్ ఆఫ్ డెలివరింగ్ గవర్నెన్సులో ఫలితాలు రావాలనే లక్ష్యంతో పని చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆదేశించారు. కాగా.. గత 13 సమావేశాల్లో రూ.8.55 లక్షల కోట్ల పెట్టుబడులకు, 8.23 లక్షల ఉద్యోగ అవకాశాలకు ఎస్ఐపీబీ ఆమోదం తెలిపిన విషయం తెలిసిందే. అలాగే పరిశ్రమలు, పర్యాటకం, ఫుడ్ ప్రాసె సింగ్, ఇంధన రంగాల్లో వివిధ పెట్టుబడులను 14వ ఎస్ఐపీబీ సమావేశం ఆమోదించనుంది. ఈ సమావేశానికి మంత్రులు నారా లోకేష్, అచ్చెన్నాయుడు, పయ్యావుల కేశవ్, గొట్టిపాటి రవి, అనగాని సత్యప్రసాద్, నారాయణ, టీజీ భరత్, కందుల దుర్గేష్, బీసీ జనార్దన్ రెడ్డి, వాసంశెట్టి సుభాష్, సీఎస్ విజయానంద్, వివిధ శాఖల ఉన్నతాధికారులు హాజరయ్యారు.

## రాష్ట్ర అక్రిడేషన్ కమిటీని నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు



**విజయవాడ, (రాజధాని వార్తలు):** రాష్ట్ర ప్రభుత్వం స్టేట్ మీడియా అక్రిడిటేషన్ కమిటీని ఏర్పాటు చేసింది. ఈ మేరకు మంగళవారం నాడు జీవో ఆర్.టి.నెం.30ని విడుదల చేసింది. రాష్ట్ర స్థాయిలో జర్నలిస్టులకు అక్రిడిటేషన్లు మంజూరు చేసేందుకు మార్గం సుగమం అయింది.

గత వైకాపా ప్రభుత్వ హయాంలో ఇచ్చిన అక్రిడి టేషన్ కార్డులనే ఇప్పటి వరకూ పొడిగించుకుంటూ వస్తున్నారు. ఏడాదిన్నర నుంచి అక్రిడిటేషన్ ఇస్తామంటూ కూటమి ప్రభుత్వం కాలక్షేపం చేసింది. అయితే ఎట్టకేలకు అక్రిడిటేషన్ కమిటీల ఏర్పాటుతో అక్రిడిటేషన్ పక్రియ ముందుకు వెళ్లనుంది. ఈ కమిటీకి రాష్ట్ర సమాచార శాఖ డైరెక్టర్ ఛైర్మన్‌గా ఉంటారు.

## స్వర్ణ నందిపురస్కారం పొందిన చిన్నారి సత్య మనస్విని









**చాగల్లు, (రాజధాని వార్తలు):** కూచిపూడి నృత్యంలో మూడో తరగతి చదువుతున్న జొన్నకూటి సత్య మనస్విని స్వర్ణ నంది పురస్కారం పొందింది. చాగల్లు మండలం ఊనగట్ల గ్రామానికి చెందిన జొన్నకూటి శేషయ్య (వీఆర్వో), దేవి (ఏ.ఎన్.ఎం) దంపతుల కుమార్తె మనస్విని.

కొవ్వూరులోని నిత్య కూచిపూడి డ్యాన్స్ అకాడమీలో శిక్షణ పొందిన ఎనిమిదేళ్ల చిన్నారి ఈనెల 4న హైదరాబాద్ రవీంద్ర భారతిలో జరిగిన సంక్రాంతి స్వర్ణ నంది పురస్కారాల్లో కూచిపూడి నృత్యంలో ప్రతిభ కనబరిచింది. ఈ నేపధ్యంలోనే మనస్విని నంది పురస్కారం కైవసం చేసుకుంది. సెల్ ఫోన్లకే పరిమితం అవ్వకుండా సంప్రదాయ విధానంలో కూచిపూడి నృత్యం వైపు రాణిస్తున్న చిన్నారి మనస్విని భరత్ అకాడమీ ఫౌండర్ లలిత ప్రత్యేకంగా సన్మానించారు. ఈ సందర్భంగా నిత్య కూచిపూడి డ్యాన్స్ అకాడమి నిర్వాకురాలు ప్రవళిక, కొవ్వూరు ఏఎంసీ ఛైర్మన్ నాదెళ్ల శ్రీరామ్ చౌదరి, తెదేపా జిల్లా ఉపాధ్యక్షుడు ఆళ్ల హరిబాబు, తదితరులు అభినందించారు.

## భోగాపురం ఎయిర్‌పోర్ట్ ఘనత నూటికి నూరు శాతం కూటమిదే : బీజేపీ చీఫ్

**విశాఖపట్నం, (రాజధాని వార్తలు):** భోగాపురం ఎయిర్‌పోర్ట్ ఘనత తమదేనంటూ ప్రచారం చేస్తున్న వైసీపీకి ఏపీ బీజేపీ చీఫ్ పీవీఎన్ మాధవ్ మంగళవారం విశాఖపట్నంలో స్ట్రాంగ్ కౌంటర్ ఇచ్చారు. ఈ భోగాపురం ఎయిర్‌పోర్ట్ ఘనత నూటికి నూరు శాతం కూటమిదేనని ఆయన స్పష్టం చేశారు. అందులో ఏ మాత్రం సందేహం లేదన్నారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో రాష్ట్రంలో అరాచకం సృష్టించి.. సంపద లేకుండా చేశారని మండిపడ్డారు. ఇప్పుడన్నీ తామే చేశామని వైసీపీ నేతలు చెబుతారని ఆయన వ్యంగ్యంగా అన్నారు. భోగాపురం ఏయిర్‌పోర్టు వల్ల మంచి జరుగుతుందని..దీనిని స్వాగతించాలని వైసీపీ నేతలను తాను కోరుతున్నామని పేర్కొన్నారు. తెలుగు రాష్ట్రాల నీటి ప్రాజెక్టులు, కృష్ణా, గోదావరి నదీ జలాల వాటా సమస్యలు పరిష్కరించుకోవడానికి ట్రిబ్యునల్స్ ఉన్నాయని గుర్తు చేశారు. బచావత్ ట్రైబునల్ కూడా సమావేశమైందన్నారు. ఏదైనా రాష్ట్రాలో నీటి సమస్యలు, అభ్యంతరాలు ఉంటే..ఆయా రాష్ట్రాల ముఖ్యమంత్రులు చెబుతారని వివరించారు. ఆ సమస్యలను సామరస్య పూర్వకంగా పరిష్కరించుకోవాలని సూచించారు. ఏపీ ప్రభుత్వం వ్యూహాత్మకంగా కొన్ని కొత్త ప్రాజెక్టులను ప్రకటించిందన్నారు. అలాగే పాత ప్రాజెక్టులను



పూర్తి చేసుకొని ముందుకు వెళ్తోందన్నారు. హంద్రీనీవా ప్రాజెక్టులు పూర్తి చేసి.. కుప్పం వరకు నీళ్లు అందిస్తామని ఈ సందర్భంగా బీజేపీ చీఫ్ పీవీఎన్ మాధవ్ ప్రకటించారు. త్వరలోనే పురుషోత్తపట్నం ప్రాజెక్ట్ పూర్తి స్థాయి పనులు ప్రారంభమవుతాయని.. అలాగే ఉత్తరాంధ్ర సుజల స్రవంతి పనులు వేగవంతం అవుతున్నాయని తెలిపారు. ప్రాజెక్టులన్నీ పూర్తయితే.. ఏపీ సమగ్రాభివృద్ధి శరవేగంగా జరుగుతుందని రాష్ట్ర బీజేపీ చీఫ్ పీవీఎన్ మాధవ్ విశ్వాసం వ్యక్తం చేశారు.

# పొట్టేపాలెం బ్రిడ్జితో లక్షల మందికి లబ్ధి

## - ప్రజల మనిషి ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి - ఒకే వేదికపై అన్ని పార్టీల నాయకులను తీసుకురావడం గొప్ప విషయం

## - విద్యార్థి నాయకుడిగా పోరాటాలు చేసి మూడుసార్లు ఎమ్మెల్యేగా గెలిచారు - రహదారి ప్రమాదాలకు ఇక చెల్లుచీటి









**నెల్లూరు, (రాజధాని వార్తలు):** పొట్టేపాలెం కలుజు వద్ద బ్రిడ్జి నిర్మాణంతో లక్షలాది మంది ప్రజలకు రవాణా సౌకర్యం మెరుగు పడడం సంతోషంగా ఉందని నెల్లూరు పార్లమెంటు సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి అన్నారు. నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి ప్రజల మనిషి కాబట్టే మూడుసార్లు ఎమ్మెల్యేగా గెలుపొంది ప్రజాసేవలో ఉన్నారన్నారు. అనుకున్నది సాధించే తత్వం కోటంరెడ్డికే సాధ్యమని చెప్పారు. నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే టిడిపి జిల్లా అధ్యక్షులు బీద రవిచంద్ర, కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి, కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి, నగర ఇంచార్జ్ మేయర్ రూప్ కుమార్ యాదవ్, టీడీపీ నాయకులు కోటంరెడ్డి గిరిధర్ రెడ్డి, బీజేపీ జిల్లా అధ్యక్షులు సీపారెడ్డి వంశీధర్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు నారపరెడ్డి కిరణ్ కుమార్ రెడ్డి, సిపిఐ నాయకులు పముజుల దశరథ రామయ్య, సిపిఎం నాయకులు అరిగెల నాగేంద్ర సాయి, జనార్దన్, జనసేన నాయకులు చంద్రశేఖర్ రెడ్డి, నూనె మల్లికార్జున యాదవ్ తదితరులతో కలిసి పొట్టేపాలెం కలుజువద్ద బ్రిడ్జి నిర్మాణానికి శంకుస్థాపన, విపిఆర్ అమృత ధార వాటర్ ప్లాంట్ ప్రారంభోత్సవం చేశారు. అంతకు ముందు వేమిరెడ్డి దంపతులకు రూరల్ ప్రజలు, కూటమి నాయకులు, కార్యకర్తలు అపూర్వ స్వాగతం పలికారు. భారీ గజమాలతో ఘనంగా సత్కరించారు. అనంతరం శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు నిర్వహించారు. ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ.. పొట్టేపాలెం వద్ద బ్రిడ్జి నిర్మాణం.. 25-30 ఏళ్ల కల అని, ఇన్నాళ్లకు అది సాధ్యమయిందన్నారు. గతంలో తనకు ఈ ప్రాంతంలో మైనింగ్ ఉండేదని, రహదారి ఇబ్బందుల వల్లే వదిలేశానన్నారు. ఇన్నాళ్లకు ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి ఇది సాధించారన్నారు. రాష్ట్రంలో ఆర్థికంగా ఇబ్బందులు ఉన్నా.. అభివృద్ధికి నిధులు మాత్రం అందిస్తున్నారని చెప్పారు. ఒక్క పెన్షన్ల వరకే ఇప్పటివరకు 50 వేల కోట్లు ఖర్చు చేశారన్నారు. సంక్షేమం, అభివృద్ధే ధ్యేయంగా సీఎం ముందుకు వెళుతున్నారని స్పష్టం చేశారు. 9 కోట్ల విలువైన బ్రిడ్జిని తగ్గించి.. పొట్టేపాలెం బ్రిడ్జి మంజూరు చేశారన్నారు. అది శ్రీధర్‌రెడ్డి పట్టుదలకు నిదర్శనమని చెప్పారు. ఎంతో పట్టుదల, ప్రజల పట్ల ప్రేమ ఉండబట్టే 3 సార్లు ఎమ్మెల్యే అయ్యారన్నారు. ఇలాంటి ఎమ్మెల్యే ఉండటం రూరల్ ప్రజల అదృష్టమన్నారు. కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి కూడా ఎంతో కష్టపడుతున్నారని, ప్రజల మనసు తెలుసుకుని ముందుకు సాగాలని సూచించారు. ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డికి పాలిటిక్స్ అంటే ప్యాషన్ అని, అందుకే నిరంతరం ప్రజల మధ్య తిరుగుతూ వారి సంక్షమానికి పని చేస్తున్నారన్నారు. ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి సూచనల మేరకు తప్పకుండా కొండాయపాలెం, బివి నగర్ ప్రాంతాల్లో రైల్వే అండర్ పాసుల నిర్మాణాలు చేపట్టేలా చర్యలు తీసుకుంటామని వెల్లడించారు. ఎవరిని కలవాలన్నా కలుస్తామని ఆయన చెప్పారు. పొట్టేపాలెం బ్రిడ్జిని 8 నెలల్లో పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తెచ్చేందుకు ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి కృషి చేస్తున్నారన్నారు. వైద్యం నిమిత్తం కేరళ వెళుతున్న కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి సంపూర్ణ ఆరోగ్యంతో తిరిగి రావాలని, మళ్లీ ప్రజాసేవలో పాల్గొనాలని ఆయన ఆకాంక్షించారు. కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి మాట్లాడుతూ.. పొట్టేపాళెం కలుజుపై బ్రిడ్జి నిర్మాణం నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి పోరాట ఫలితమేనన్నారు. అసెంబ్లీలో పొట్టేపాళెం కలుజుపై బ్రిడ్జ్ నిర్మాణ సమస్యను లేవనెత్తి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుని ఒప్పించి నిధులు సాధించారన్నారు. పొట్టేపాళెం కలుజుపై బ్రిడ్జ్ నిర్మాణం కోసం అన్ని రాజకీయ పార్టీలను మద్దతు కూడగట్టడం ఎమ్మెల్యే శ్రీధర్ రెడ్డికే సాధ్యమయిందన్నారు. కలుజుపై బ్రిడ్జి నిర్మాణం నెల్లూరు రూరల్ పరిధిలోని గ్రామాలకే కాక కోవూరు నియోజకవర్గంలోని జొన్నవాడ, మినగల్లు, పెనుబల్లి గ్రామవాసులకు ఎంతో ప్రయోజనకరంగా ఉంటుందన్నారు. ముఖ్యంగా జొన్నవాడ ఆలయానికి వెళ్లే భక్తులకు ఎంతో సౌకర్యమని చెప్పారు. ఎమ్మెల్సీ, టీడీపీ జిల్లా అధ్యక్షుడు బీద రవిచంద్ర మాట్లాడుతూ జిల్లాలో యువజన నాయకుడిగా ఉండి 30 సంవత్సరాల తరువాత ఎమ్మెల్యే అయినటువంటి ఒకేఒక్క యువజన నాయకుడు కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి అని చెప్పారు. రూరల్ నియోజకవర్గం అభివృద్ధికి తామంతా కలిసి పనిచేస్తామని స్పష్టం చేశారు ఎమ్మెల్యే శ్రీధర్ రెడ్డి మాట్లాడుతూ ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు నేడు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, యువనేత నారా లోకేష్ పొట్టేపాలెం కలుజుపై బ్రిడ్జి హామీని నెరవేర్చారన్నారు. ఎన్నికలు ఉన్నా లేకున్నా నిరంతరం జనాల్లో ఉండటం తనకు ఇష్టమని, తనను నమ్ముకున్న కార్యకర్తలకు అన్యాయం జరిగితే చూస్తూ ఊరుకోననీ, నెల్లూరు రూరల్ నియోజకవర్గ సమస్యల పరిష్కారం మరియు అభివృద్ధి విషయంలో రాజీ పడేదే లేదన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు ఇందుపూరు శ్రీనివాసులు రెడ్డి, శ్రీ వేదగిరి లక్ష్మీ నరసింహస్వామి దేవస్థానం ఛైర్మెన్ ఇందుపూరు అచ్యుత్ రెడ్డి, టిడిపి నాయకులు కమలాకర్ రెడ్డి, కేతంరెడ్డి వినోద్ రెడ్డి, జనసేన నాయకులు గుడి హరిరెడ్డి, గునుగుల కిషోర్, క్లస్టర్, కో క్లస్టర్ ఇంచార్జులు, డివిజన్ అధ్యక్షలు, గ్రామ అధ్యక్షులు, కార్పొరేటర్లు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, అనుబంధ సంఘ అధ్యక్షలు తదితరులు పాల్గొన్నారు.

# గ్రామీణ ప్రాంతాలకు బయోమైనింగ్ విస్తరణ - అత్యాధునిక యంత్రాల ద్వారా చెత్త తొలగించే యత్నం

## - స్వచ్ఛ సంక్రాంతి - స్వచ్ఛ గ్రామ పంచాయతీ సభలో పట్టాభిరామ్





**అమరావతి, (రాజధాని వార్తలు):** పేరుకుపోయిన చెత్త తొలగింపునకు గ్రామీణ ప్రాంతాలకు కూడా బయోమైనింగ్ విస్తరణ జరుగుతుందని స్వచ్ఛ ఆంధ్ర కార్పొరేషన్ చైర్మన్ కొమ్మారెడ్డి పట్టాభిరామ్ చెప్పారు. విజయవాడ రూరల్ మండలం గొల్లపూడి గ్రామంలో సోమవారం జరిగిన స్వచ్ఛ సంక్రాంతి - స్వచ్ఛ గ్రామ పంచాయతీ సభలో ఆయన ప్రసంగించారు. ఆధునిక యంత్రాల ద్వారా గ్రామాలలో పారిశుద్ధ్యాన్ని మెరుగుపరిచి, మార్పు తీసుకు రావాలన్నది ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌ల సంకల్పమని చెప్పారు. దానికి అనుగుణంగా స్వచ్ఛ ఆంధ్ర కార్పోరేషన్ పని చేస్తోందన్నారు. గ్రామీణ ప్రాంతాలలో పేరుకుపోయిన చెత్తని ఆధునిక యంత్రాల (లిట్టర్ పిక్కర్స్) సహాయంతో తొలగించే ఏర్పాటు చేస్తామని చెప్పారు. అటువంటి యంత్రాలను కనీసం మండలానికి ఒకటి అందించాలన్న ఉద్దేశం ఉందన్నారు. తొలుత ప్రయోగాత్మకంగా నియోజకవర్గానికి ఒక యంత్రం అందించే ఏర్పాటు చేసేందుకు ప్రయత్నిస్తున్నట్లు చెప్పారు. తర్వాత 175 నియోజకవర్గాలకు అందజేయాలన్న ఆలోచన ఉన్నట్లు తెలిపారు. మునిసిపాలిటీలలో ఏర్పాటు చేసే చెత్త ప్రాసెసింగ్ సెంటర్ల పరిధిలోకి గ్రామాలను కూడా చేర్చి, గ్రామాలలోని చెత్తని ఏరోజుకారోజు తొలగించే ఏర్పాటు చేస్తామన్నారు.

**గ్రామీణ శానిటేషన్ వర్కర్స్‌కి కూడా ఇన్సూరెన్స్ సౌకర్యం**

గ్రామీణ శానిటేషన్ వర్కర్స్‌కి కూడా అర్బన్ ప్రాంతాలలోని వర్కర్స్ మాదిరిగా ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పించడానికి ప్రయత్నిస్తున్నట్లు పట్టాభిరామ్ చెప్పారు. వారికి కూడా గ్లౌజ్‌లు మాస్కులు, షూస్ అందజేయనున్నట్లు తెలిపారు. శానిటేషన్ వర్కర్స్‌కి అవసరమైన కిట్స్ కొరత ఉంటే, ఆ విషయం తమ దృష్టికి తీసుకువస్తే, వాటిని సమకూరుస్తామని చెప్పారు. వారికి కావలసిన కిట్స్ అందజేస్తే, వారు ఆరోగ్యకరంగా ఉండటానికి, ఉత్సాహంగా పని చేయడానికి అవకాశం ఉంటుందన్నారు.

**పారిశుద్ధ్య కార్మికుల ట్రైసైకిల్స్, ఎలక్ట్రిక్ ఆటోలు**

డిప్యూటీ ముఖ్యమంత్రి, పంచాయతీ రాజ్ శాఖా మంత్రి పవన్ కళ్యాణ్ సహకారంతో గ్రామాల్లో అనేక కార్యక్రమాలు విజయవంతంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పారిశుద్ధ్య కార్మికుల పనిని సులభతరం చేయడానికి ట్రైసైకిల్స్, ఎలక్ట్రిక్ ఆటోలు కూడా ఇస్తున్నామన్నారు. గత ప్రభుత్వంలో ఇచ్చినటువంటి వాహనాలు కాకుండా, ఆధునిక టెక్నాలజీ, మంచి క్వాలిటీతో ఉన్న వాహనాలను ఇస్తున్నట్లు తెలిపారు. పైలెట్ ప్రాజెక్టు కింద ఇప్పటికే 200 వాహనాలు అందజేసినట్లు తెలిపారు. మరిన్ని వాహనాలను కూడా వారికి అందజేస్తామని చెప్పారు. పారిశుద్ధ్య కార్మికుల కష్టం తనకు తెలుసని, ఎండైనా, వానైనా వారు కష్టపడి పని చేస్తుంటారని కొనియాడారు. ఈ వాహనాల ద్వారా పారిశుద్ధ్య కార్మికులకు శ్రమ తగ్గి, ఎక్కువ చెత్తని సేకరించడానికి అవకాశం ఉంటుందని వివరించారు.

**ప్రచారం కంటే పరిష్కారానికి ప్రాధాన్యత**

చీపురు పట్టుకుని ఫొటోలు దిగి ప్రచారం చేయడం కాకుండా, ప్రజలకు శాశ్వతమైన పరిష్కారం చూపే పద్ధతిలో పనులు చేస్తున్నట్లు తెలిపారు. మునిసిపాలిటీల పరిధిలో గతంలో పేరుకుపోయిన చెత్తకు సంబంధించి బయోమైనింగ్ జరుగుతున్నట్లు చెప్పారు. ఈ గ్రామ సభ ద్వారా మీరంతా స్వచ్ఛతకు బ్రాండ్ అంబాసిడర్లుగా నిలబడి, గ్రామాలలోని ప్రజలకు పారిశుద్ధ్యం విషయంలో అవగాహన కల్పించాలన్నారు. 'స్వచ్ఛ సంక్రాంతి - స్వచ్ఛ గ్రామ పంచాయతీ' కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని గ్రామస్థులను పట్టాభిరామ్ కోరారు.

**పారిశుద్ధ్య కార్మికులతో మాటామంతీ**

పట్టాభిరామ్ పారిశుద్ధ్య కార్మికులతో మాట్లాడి, వారు చేస్తున్న పనుల గురించి తెలుసుకున్నారు. వారితో కలిసి ఫొటోలు దిగారు. పారిశుద్ధ్య కార్మికులకు చేతులకు గ్లౌజులు, కాళ్లకు షూస్ ఇస్తున్నారా? అని అధికారులను ప్రశ్నించగా, ఇస్తున్నట్లు చెప్పారు. పంచాయతీ ఆవరణలో ఒక మొక్క నాటి, నీరు పోశారు. అనంతరం, గ్రామ పంచాయతీ అధికారులు, పంచాయతీ సిబ్బందితో పట్టాభిరామ్ సమావేశమై, పారిశుద్ధ్యానికి సంబంధించిన పలు విషయాలు చర్చించారు.

# భారత్ మండపంలో 'వికాసిత్ భారత్ యువ నాయకుల డైలాగ్ 2026'కు రంగం సిద్ధం




**విజయవాడ, (రాజధాని వార్తలు):** భారత ప్రభుత్వ యువజన వ్యవహారాలు మరియు క్రీడల మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో పునః రూపకల్పన చేయబడిన జాతీయ యువజన ఉత్సవం 'వికాసిత్ భారత్ యువ నాయకుల డైలాగ్ 2026' రెండవ ఎడిషన్ ఘనంగా నిర్వహించబడనుంది. జనవరి 9 నుండి 12 వరకు న్యూఢిల్లీలోని భారత్ మండపంలో ఈ వేడుకలు జరగనున్నాయి. అద్భుతమైన ఎంపిక ప్రక్రియ ఈ ప్రయాణం మై భారత్ వేదికపై నిర్వహించిన క్విజ్‌తో ప్రారంభమైంది, ఇందులో దేశవ్యాప్తంగా 50 లక్షల మంది యువత పాల్గొన్నారు. పది ప్రధాన ఇతివృత్తాలపై వ్యాసాలు సమర్పించిన 2.5 లక్షల మందిలో, 15,000 మంది రాష్ట్ర స్థాయికి ఎంపికయ్యారు. చివరగా 677 జిల్లాల నుండి జానపద కళలు, కవిత్వం మరియు చిత్రలేఖనంలో ప్రతిభ చాటిన 954 మంది విజేతలు జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొంటారు.

VBYLD 2026 ప్రధానాంశాలు:

కొత్త విభాగాలు: ఐఐటి బాంబే ఆధ్వర్యంలో 'హ్యాక్ ఫర్ సోషల్ కాజ్, స్కూల్ ఆఫ్ ప్లానింగ్ అండ్ ఆర్కిటెక్చర్ ఆధ్వర్యంలో 'డిజైన్ ఫర్ భారత్ వంటి వినూత్న కార్యక్రమాలు.

అంతర్జాతీయ భాగస్వామ్యం: 'నో ఇండియా ప్రోగ్రామ్ కింద 80 మంది ప్రవాస భారతీయ యువత, BIMSTEC దేశాలు మరియు నేపాల్ ప్రతినిధుల భాగస్వామ్యం.

ప్రముఖుల సమక్షం: జాతీయ భద్రతా సలహాదారు అజిత్ దోవల్, క్రీడా దిగ్గజాలు పుల్లెల గోపీచంద్, లీయాండర్ పేస్, హర్మన్‌ప్రీత్ కౌర్ మరియు సాంకేతిక నిపుణుడు శ్రీధర్ వెంబు యువతకు దిశానిర్దేశం చేయనున్నారు.

గగన్‌యాన్ వ్యోమగాములతో చర్చ: ఇస్రో వ్యోమగాములు (గగన్‌యాత్రిలు) గ్రూప్ ప్టైన్ శుభాన్షు శుక్లా మరియు ప్రశాంత్ బాలకృష్ణన్ నాయర్‌లతో ప్రత్యేక ముఖాముఖి.

ముగింపు వేడుకలో గౌరవ ప్రధానమంత్రి ఈ నాలుగు రోజుల ఉత్సవం జనవరి 12న ముగుస్తుంది. ఈ ముగింపు వేడుకకు గౌరవ ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ హాజరవుతారు. యువత అందించిన అత్యుత్తమ ప్రజెంటేషన్లను ఆయన వీక్షించడమే కాకుండా, ఉత్తమ వ్యాసాల సంకలనాన్ని ఆవిష్కరిస్తారు. ఉత్సవ ప్రాంగణంలో వివిధ కేంద్ర మంత్రిత్వ శాఖల ఆధ్వర్యంలో విక్షిత్ భారత్ ఎగ్జిబిషన్ కూడా నిర్వహించబడుతుంది.

పది ప్రధాన ఇతివృత్తాలు

ప్రజాస్వామ్యం & ప్రభుత్వం: విక్షిత్ భారత్ కోసం యువత పాత్ర.

మహిళా నాయకత్వం: అభివృద్ధికి కీలకం.

ఫిట్ భారత్, హిట్ భారత్: ఆరోగ్యం మరియు ఫిట్‌నెస్.

స్టార్ట్-అప్ రాజధాని: గ్లోబల్ హబ్‌గా భారత్.

మృదువైన శక్తి : సాంస్కృతిక దౌత్యం.

సంప్రదాయం & ఆవిష్కరణ: ఆధునిక భారత్ నిర్మాణం.

ఆత్మనిర్భర్ భారత్: మేక్ ఇన్ ఇండియా ఉ మేక్ ఫర్ ది వరల్డ్.

స్మార్ట్ వ్యవసాయం: ఉత్పాదకత పెంపు.

గ్రీన్ విక్షిత్ భారత్: స్థిరమైన అభివృద్ధి.

ఫ్యూచర్ రెడీ వర్క్‌ఫోర్స్: నైపుణ్యం కలిగిన శ్రామిక శక్తి.

కార్యక్రమ కాలపట్టిక రోజు ప్రధాన కార్యక్రమాలు

రోజు 1 (జనవరి 9)

ఎంపిక రౌండ్లు, ఓరియంటేషన్, ప్రధానమంత్రి సంగ్రహాలయ & యుద్ధ స్మారక సందర్శన.

రోజు 2 (జనవరి 10)

ప్రారంభోత్సవం: శ్రీ అజిత్ దోవల్ గారి సమక్షంలో. నిపుణులతో (పుల్లెల గోపీచంద్, లీయాండర్ పేస్, తదితరులు) చర్చలు. కేంద్ర మంత్రులతో విందు.

రోజు 3 (జనవరి 11)

సంభాషణలు: శ్రీధర్ వెంబు, ఇస్రో గగన్‌యాత్రిలు, హర్మన్‌ప్రీత్ కౌర్. సాంస్కృతిక ప్రదర్శన: "కలర్స్ ఆఫ్ విక్షిత్ భారతు.

రోజు 4 (జనవరి 12)

ముగింపు వేడుక: గౌరవనీయ ప్రధాని నరేంద్ర మోదీ హాజరు. ప్రజెంటేషన్లు & వ్యాస సంకలన విడుదల.

# శాఖల మధ్య సమన్వయంతో సమస్యల పరిష్కారం

## - అర్జీల అసంతృప్తి శాతం ఇంకా తగ్గాలి - తాగునీరు, పారిశుద్ధ్యం, పది పరీక్షలపై దృష్టి పెట్టాలి : జిల్లా కలెక్టర్ ఎస్.రాం సుందర్ రెడ్డి

**విజయనగరం, (రాజధాని వార్తలు):** అన్ని శాఖల మధ్య సమన్వయం ఉండాలని, అధికారులు చర్చించుకుంటేనే సమస్యలకు తగు పరిష్కారం దొరుకుతుందని, స్నేహపూర్వక వాతావరణంలో పని చేయాలని జిల్లా కలెక్టర్ ఎస్.రాం సుందర్ రెడ్డి పేర్కొన్నారు. సోమవారం మధ్యాహ్నం పిజిఆర్ఎస్ సమీక్ష కలెక్టరేట్ సమావేశ మందిరంలో కలెక్టర్ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మండల ప్రత్యేకాధికారుల కృషి వలన అర్జీల పరిష్కారంలో అర్జీదారుల అసంతృప్తి శాతం కొంత తగ్గిందని, ఇంకనూ తగ్గాల్సి ఉందని తెలిపారు. పోలీస్ శాఖలో ఎక్కువ అసంతృప్తి పెరుగుతోందని, దీనిపై పోలీస్ అధికారులు దృష్టి పెట్టాలన్నారు. ఇంటింటి సర్వే మొదలై నెల రోజులైనా 4 శాతం పూర్తయిందని, ఫిబ్రవరి 10 నాటికి సర్వే పూర్తి కావాలని, దీనిపై దృష్టి పెట్టాలని సూచించారు. 10వ తరగతి పరీక్షలపై 100 రోజుల ప్రణాళిక పక్కాగా అమలు కావాలని, వెనుకబడిన విద్యార్థులున్న చోట హెచ్.ఎంలను పిలిపించాలని డి.ఈ.ఓ కు సూచించారు. వసతి గృహాల్లో పారిశుధ్యం, తాగునీరు మెరుగ్గా ఉండాలని, ప్రతి ఒక్కరు అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. పండగ ఆనందంగా జరుపుకోవాలంటే ఎక్కడ ఎలాంటి సమస్య తలెత్తకుండా చూడాల న్నారు. సచివలయాల, విలేజ్ క్లినిక్‌ల నిర్మాణాలు వేగవంతం కావాలని అన్నారు. ఈ సమావేశంలో జేసీ సేదు మాధవన్, డి.ఆర్.ఓ మురళి, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

# అభివృద్ధికి చిరునామా - కూటమి ప్రభుత్వ పాలన

**- కొరుటూరులో అపూర్వ స్వాగతం - గుర్రపు బగ్గీ పై వేమిరెడ్డి దంపతుల ఊరేగింపు - భారీగా తరలి వచ్చిన కూటమి నాయకులు, కార్యకర్తలు, గ్రామస్తులు - అభివృద్ధి, సంక్షమం చంద్రబాబుకే సాధ్యం - విపిఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో వాటర్ ప్లాంట్ ప్రారంభోత్సవం - 19 నెలల్లో 5 కోట్ల లక్షల రూపాయలతో అభివృద్ధి పనులు చేసాం - దేశంలోనే తొలిసారి విద్యుత్ ఛార్జీల తగ్గించిన ఘనత చంద్రబాబుకే దక్కుతుంది - ఎంఎస్ఎంఇ రాష్ట డైరెక్టర్ రావెళ్ల వీరేంద్ర నాయుడుకు జన్మదిన శుభకాంక్షలు - ఎంపి వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి, ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి**









**నెల్లూరు, (రాజధాని వార్తలు):** ప్రజలు తమను ఆదరిస్తున్న తీరు చూస్తుంటే ఎన్నికల విజయోత్సవాన్ని తలపిస్తుందన్నారు ఎంపి వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి. ఇందుకూరు పేట మండలంలో కొరుటూరు గ్రామంలో పలు అభివృద్ధి కార్యక్రమాల ప్రారంభోత్సవం మరియు శంఖుస్థాపన కార్యక్రమంలో ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డితో కలిసి ఆయన పాల్గొని విపిఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఆర్ఓ వాటర్ ప్లాంట్ ప్రారంభించారు. అనంతరం రాష్ట ఎంఎస్ఎంఇ డైరెక్టర్ రావెళ్ల వీరేంద్ర నాయుడు జన్మదినాన్ని పురస్కరించుకొని ఏర్పాటు చేసిన కార్యక్రమానికి వేమిరెడ్డి దంపతులను గుర్రపు బగ్గీ స్వారీ చేస్తూ చేరుకున్నారు. రావెళ్ల వీరేంద్ర నాయుడుకి జన్మదిన శుభాకాంక్షలు తెలిపాక కొరుటూరులో పలు అభివృద్ధి కార్యక్రమాలకు సంబంధించిన శిలాఫలకాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎంపి వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి మాట్లాడుతూ విపిఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో జిల్లా వ్యాప్తంగా 190కి పైగా వాటర్ ప్లాంట్లు ఏర్పాటు చేసి ప్రజల దాహార్తి తీరుస్తున్నట్టు తెలిపారు. వాటర్ ప్లాంట్ ఇన్స్టాలేషన్‌తో పాటు మెయింటెనెన్స్ కూడా విపిఆర్ ఫౌండేషన్ చేస్తుందన్నారు. విపిఆర్ ఫౌండేషన్ ద్వారా కోవూరు నియోజకవర్గంలో దివ్యాంగులకు 200 కు పైగా బ్యాటరీ ట్రై సైకిల్స్ అందచేసినట్టు ఎంపి వేమిరెడ్డి వెల్లడించారు. విపిఆర్ నేత్ర ద్వారా ఉదయగిరి ప్రాంతంలో వేలాది మందికి కంటి పరీక్షలు చేసి దృష్టి లోపం వున్న వారిని గుర్తించి దాదాపు 7 వేల మందికి కంటి అద్దాలు పంపిణి చేశామన్నారు. త్వరలో కోవూరు నియోజకవర్గంలో కూడా విపిఆర్ నేత్ర సేవలను అందుబాటులోనికి తెస్తామన్నారు. అనంతరం ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డి మాట్లాడుతూ అధికారం అనేది హెూదా కాదని అది ఒక బాధ్యతని ప్రజలు తనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటానన్నారు. ప్రభుత్వ ప్రగతి ఫలాలను ప్రతి గడపడమే లక్ష్యంగా పని చేస్తున్నానన్నారు. ఇచ్చిన మాట నిలబెట్టుకుంటూ కొరుటూరు గ్రామంలో 5 కోట్ల 34 లక్షల రూపాయలతో అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టడం చాలా సంతోషంగా వుందన్నారు. కూటమి ప్రభుతం అధికారంలోనికి వచ్చాక 40 లక్షలతో కొరుటూరు గ్రామం నుంచి కొరుటూరు పట్టపుపాళెం వరకు రెండు సిమెంట్ రోడ్డు నిర్మాణం, 41 లక్షలతో కొరుటూరు పట్టపుపాళెంలో పాఠశాల భవనం మరియు 34 లక్షలతో పిడి కండ్రిగ వద్ద బస్ షెల్టర్ నిర్మాణాలు చేసినట్లు ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డి తెలిపారు. 36 లక్షలతో విలేజ్ హెల్త్ సెంటర్, 6 లక్షల 70 వేలతో ఎస్టీ కాలనీలో టివి రూం, 14 లక్షలతో హరిజనవాడలో అంగన్ వాడి భవనాల నిర్మాణాలు చేపట్టామన్నారు. 2 కోట్ల 60 లక్షలతో కొరుటూరు నుంచి మైపాడుకు దీ నిర్మాణం చేపట్టామని కొల్లిమిట్టపాళెంలో 28 లక్షల తాగునీటి అవసరాల కోసం ఓవర్ హెడ్ వాటర్ ట్యాంక్ 35 లక్షలతో సాగునీటి కాలువల మరమత్తుల కోసం వెచ్చించామన్నారు. కూటమి ప్రభుత్వంలో అమలైన పెన్షన్ల పెంపు, దీపం 2, తల్లికి వందనం, అన్నదాత సుఖీభవ, మత్స్యాకార సేవలో తదితర సంక్షమ పథకాల గురించి ఆమె ప్రజలకు వివరించారు. గత ప్రభుత్వం 9 సార్లు విద్యుత్ చార్జీలు పెంచి ప్రజలపై భారం మోపితే 4 వేల 498 కోట్ల రూపాయల ట్రూఅప్ భారాన్ని ప్రభుత్వమే మోసేలా నిర్ణయం తీసుకొని చంద్రబాబు నాయుడు యానిట్‌కు 13 పైసలు తగ్గించారన్నారు. గత ప్రభుత్వ పాలనలో అక్వా రైతులకు యూనిట్ కు 3 రూపాయల 50 పైసలు వసూలు చేస్తే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక చంద్రబాబు 1 రూపాయ 50 పైసలకు తగ్గించిన విషయాన్ని ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డి ప్రజలకు వివరించారు. విపిఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో చేస్తున్న విపిఆర్ విద్య, వైద్యం, విపిఆర్ వికాసం తదితర సేవా కార్యక్రమాలు గురించి ఆమె మాట్లాడుతూ విపిఆర్ అమృతధార ద్వారా జిల్లా వ్యాప్తంగా 190 కి పైగా వాటర్ ప్లాంట్లు ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. దృష్టి లోపం వున్న వారికి ఉచిత పరీక్షలు కంటి అద్దాలు అందచేసే విపిఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న విపిఆర్ నేత్ర సేవలను త్వరలోనే తీర ప్రాంత పట్టపు పాళాలలో ప్రారంభిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల పార్టీ అధ్యక్షులు ఏకొల్లు పవన్ కుమార్ రెడ్డి, టిడిపి రాష్ట కార్యదర్శి చెముకుల కృష్ణ చైతన్య, టిడిపి సీనియర్ నాయకులు కోదూరు కమలాకర్ రెడ్డి, బెజవాడ వంశీ కృష్ణా రెడ్డి, గంగపట్నం చాముండేశ్వరి ఆలయ చైర్మన్ గుండాల కృష్ణ రెడ్డి, గుండాళ్ళమ్మపాలెం సొసైటీ అధ్యక్షులు వినీల్ రెడ్డి, ఇందుకూరు పేట అగ్రకల్చర్ సొసైటీ డైరెక్టర్ పెనుబల్లి కృష్ణ చైతన్య, ఇందుకూరు పేట అగ్రికల్చర్ సొసైటీ చైర్మన్ గండవరపు అమరనాథ్ రెడ్డి, సోమరాజుపల్లి సర్పంచ్ దేవిరెడ్డి చంద్ర మోహన్ రెడ్డిలతో పాటు టిడిపి యూనిట్, క్లస్టర్, బూత్ కమిటీ కన్వీనర్లు మరియు జనసేన బిజెపి నాయకులు పాల్గొన్నారు.

# గత ప్రభుత్వం విద్యుత్ చార్జీలు 9 సార్లు పెంచితే..కూటమి ప్రభుత్వంలో విద్యుత్ చార్జీలు తగ్గాయి

**- ఇందుకూరు పేట మండలం కొత్తూరులో వేమిరెడ్డి దంపతులకు ఘనస్వాగతం - మేళతాళాలతో ఎదురేగి స్వాగతం పలికిన టిడిపి కార్యకర్తలు, విపిఆర్ అభిమానులు - కొత్తూరు గ్రామంలో పండుగ వాతావరణం, భారీ ర్యాలీతో కిక్కిరిసిపోయిన కొత్తూరు గ్రామ వీధులు - కూటమి ప్రభుత్వం వచ్చాక కొత్తూరులో 2 కోట్ల 50 లక్షలతో అభివృద్ధి పనులు చేసాం - 4 వేల 498 కోట్ల రూపాయల ట్రూఅప్ భారాన్ని ప్రభుత్వమే భరించేలా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చెప్పడం ఒక చారిత్రాత్మక నిర్ణయం - ఆంధ్రప్రదేశ్ అభివృద్ధే లక్ష్యంగా సుపరిపాలన అందిస్తున్న చంద్రబాబు నాయుడుకి ప్రజలు అండగా నిలవాలి - ఆర్థిక పరిస్థితి అనుకూలించకపోయినా సూపర్ సిక్స్ హామీలు అమలు చేయడం చంద్రబాబు పరిపాలన దక్షతకు నిదర్శనం - ఎంపి వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి, ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి**






**నెల్లూరు, (రాజధాని వార్తలు):** ఇందుకూరు పేట మండలం కొత్తూరు గ్రామంలో రోడ్లు, డ్రైన్లు తదితర అభివృద్ధి పనుల ప్రారంభోత్సవాలు మరియు పట్టాదార్ పాస్ పుస్తకాల పంపిణి కార్యక్రమంలో పాల్గొనేందుకు విచ్చేసిన ఎంపి వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి, ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డిలకు టిడిపి కార్యకర్తలు, విపిఆర్ అభిమానులు పూల వర్షం కురిపిస్తూ మేళతాళాలతో ఘన స్వాగతం పలికారు. జై విపిఆర్, విపిఆర్ దంపతులు అభివృద్ధి ప్రదాతలంటూ నినాదాలు చేస్తూ యువత బైక్ ర్యాలీ నిర్వహించారు. వేమిరెడ్డి దంపతుల రాకతో కొత్తూరు గ్రామంలో పండుగ వాతావరణం నెలకొంది. ఈ సందర్భంగా వేమిరెడ్డి దంపతులు రోడ్లు, డ్రైన్లు మరియు విలేజ్ హెల్త్ సెంటర్‌కు సంబంధించిన ప్రారంభోత్సవ శిలా ఫలకాలు ఆవిష్కరించారు. అనంతరం ఇందుకూరు పేట మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన రైతులకు 4 వేల 819 పట్టాదార్ పాస్ పుస్తకాలను పంపిణి చేశారు. ఎంపి వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి మాట్లాడుతూ సంక్షమం అభివృద్ధి సమపాళ్లలో అమలు చేయగల సత్తా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకే ఉందన్నారు. 2 కోట్ల 50 లక్షల రూపాయలు కొత్తూరు గ్రామ అభివృద్ధికి వెచ్చించడం చాలా సంతోషంగా ఉందన్నారు. ఆర్థిక పరిస్థితి అనుకూలించకపోయినా ఎన్నికల సందర్భముగా చేసిన సూపర్ సిక్స్ హామీలను అమలు చేసి సీఎం చంద్రబాబు తన పరిపాలనా దక్షత చాటి చెప్పారన్నారు. రాష్టాభివృద్ధే లక్ష్యంగా సుపరిపాలన అందిస్తున్న చంద్రబాబు నాయుడుకి ప్రజలు అండగా నిలవాలని పిలుపునిచ్చారు. అనంతరం ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి మాట్లాడుతూ గత ఐదేళ్లలో తట్టెడు మట్టికి నోచుకోని గ్రామాలను అభివృద్ధికి చిరునామాగా మార్చాలన్నదే తన లక్ష్యమన్నారు. ఆడపడుచుగా ప్రజలు తన పట్ల చూపిస్తున్న ఆదరాభిమానాలకు ఆమె ధన్యవాదాలు తెలియ చేశారు. తాను ఎమ్మెల్యేగా ఎన్నికయ్యాక కొత్తూరు పంచాయతీ పరిధిలో జరిగిన అభివృద్ధి పనులను వివరించారు. 65 లక్షల 90 వేలతో డ్రైన్లు, 86 లక్షలతో విలేజ్ హెల్త్ సెంటర్స్ మరియు స్కూల్ కాంపౌండ్ వాల్ నిర్మాణం పూర్తి చేసుకోవడం సంతోషంగా ఉందన్నారు. కొత్తూరు పంచాయతీ పరిధిలో సిమెంట్ రోడ్ల కోసం దాదాపు 1 కోటి రూపాయలు కేటాయించామని అందులో పూర్తి పూర్తయినవి ప్రారంభోత్సవాలు, కొత్తవి శంఖుస్థాపనలు చేస్తున్నామన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోనికి వచ్చిన గత 19 నెలల్లో కొత్తూరు గ్రామాభివృద్ధికి 2 కోట్ల 50 లక్షలు కేటాయించడం జరిగిందన్నారు. గత ప్రభుత్వం ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ తీసుకొచ్చి రైతులకు మనశ్శాంతి లేకుండా చేస్తే కూటమి ప్రభుత్వం వచ్చాక ప్రభుత్వ రాజముద్రతో రైతులకు పట్టాదార్ పాస్ పుస్తకాలు అందచేస్తుందన్నారు. ట్రూ అప్ పేరుతో గత ప్రభత్వం 9 సార్లు విద్యుత్ ఛార్జీలు పెంచి రాష్ట ప్రజలపై పెనుభారం మోపితే.. ట్రూ డౌన్ అమలు ద్వారా విద్యుత్ ఛార్జీల్లో యూనిట్ కు 13 పైసలు తగ్గించి అధికారంలోకి వస్తే విద్యుత్ ఛార్జీలు తగ్గిస్తామన్న మాట నిలబెట్టుకున్నారు సిఎం చంద్రబాబు నాయుడుకి ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డి ధన్యవాదాలు తెలిపారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత 4 వేల 498 కోట్ల రూపాయల ట్రూఅప్ భారాన్ని ప్రభుత్వమే భరించేలా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చెప్పడం ఒక చారిత్రాత్మక నిర్ణయం తీసుకున్నారన్నారు. గత ప్రభుత్వ పాలనలో అక్వా రైతులకు యూనిట్ కు 3 రూపాయల 50 పైసలు వసూలు చేస్తే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక చంద్రబాబు 1 రూపాయ 50 పైసలకు తగ్గించిన విషయాన్ని ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డి గారు ప్రజలకు వివరించారు. ఈ కార్యక్రమంలో ఇందుకూరు పేట మండల తహసీల్దార్ మురళి, మండల పార్టీ అధ్యక్షులు ఏకొల్లు పవన్ కుమార్ రెడ్డి, టిడిపి జిల్లా అధికార ప్రతినిధి చెంచు కిషోర్ యాదవ్, సాగునీటి సంఘ అధ్యక్షులు దేవిరెడ్డి రవీంద్ర రెడ్డి, టిడిపి సీనియర్ నాయకులు పిఎల్ రావు, కోదూరు కమలాకర్ రెడ్డి, బెజవాడ వంశీకృష్ణారెడ్డి, తెలుగు యువత అధ్యక్షులు కదురు చంద్రారెడ్డి, స్థానిక నాయకులు ముంగర గోపాల్‌లతో పాటు టిడిపి యూనిట్, క్లస్టర్, బూత్ కమిటీ కన్వీనర్లు మరియు జనసేన, బిజెపి నాయకులు పాల్గొన్నారు.



## నెల్లూరు జిల్లా కలెక్టర్‌తో మర్యాదపూర్వక భేటీ

**నెల్లూరు, (రాజధాని వార్తలు):** నెల్లూరు జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా వారిని నెల్లూరు జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు మరియు మీాజ సభ్యులు బీదా రవిచంద్రతో కలిసి వెంకటగిరి శాసన సభ్యులు కురుగొండ్ల రామకృష్ణ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కలెక్టర్‌కి శాలువా కప్పి, పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం వెంకటగిరి నియోజకవర్గ అభివృద్ధి పనులు మరియు ప్రజా సమస్యల పరిష్కారంపై కలెక్టర్‌తో చర్చించడం జరిగింది. నియోజకవర్గ అభివృద్ధికి సహకరించాలని కోరారు.

## పనులను వేగవంతంగా పూర్తి చేయాలి

**నెల్లూరు, (రాజధాని వార్తలు):** నెల్లూరు ఆత్మకూరు బస్టాండ్ వద్ద జరుగుతున్న సిమెంట్ రోడ్డు, డ్రైనేజీ నిర్మాణ పనులను తనిఖీ చేస్తున్న నెల్లూరు నగర మేయర్ రూప్ కుమార్ యాదవ్, కమిషనర్ వైవో నందన్ తదితరులు. ఈ సందర్భంగా అక్కడ అధికారులకు పలు సూచనలు జారీ చేశారు. నగర మేయర్ రూప్ కుమార్ యాదవ్ మాట్లాడుతూ ఆత్మకూరు బస్టాండ్ నుంచి నగరంలోకి ప్రతినిత్యం వేలాది వాహనాలు రాకపోకల సాగిస్తుంటాయని అందుకు అనుగుణంగా అత్యంత నాణ్యతతో ఈ పనులు వేగవంతంగా పూర్తి చేయాలన్నారు.



# సంపాదకీయం

## లక్ష్యం చైనా.. అస్త్రం వెనెజువెలా!

కొత్త సంవత్సరం కొత్త ఆశలను మోసుకొస్తుందని అందరమూ అమాయకంగా నమ్ముతాం. కొత్త ఆశల సంగతేమో గానీ పాత ఆశలను తుంచేసే రీతిలో దాని గమనం మొదలైంది. పాలకులు నియంతలైనా, అప్రజాస్వామికులైనా వారిని మార్చివేసే హక్కును ఆ దేశాల ప్రజలకే వదిలివేయాలన్నది ఆధునిక రాజకీయాల్లో మౌలికసూత్రం. దీనికి గండికొడుతూ వెనెజువెలాపై అమెరికా దాడి చేసింది. అధ్యక్షుడు నికోలస్ మదురోను, ఆయన భార్యనూ అరెస్టుచేసి అమెరికాకు తరలించింది. మాదకద్రవ్యాల రవాణాలో మదురోకు కీలకపాత్ర ఉందని ఆరోపించి, ఆ మేరకు ఎప్పుడో కోర్టు ఉత్తర్వులు పొంది అంతా సజావుగా, చట్టబద్ధంగా చేశామని అమెరికా సమర్థించుకోవటంలో ఆశ్చర్యమేమీ లేదు. తన భద్రతకు ప్రమాదంగా పరిణమించాయని ఆరోపిస్తూ ఇష్టంలేని ప్రభుత్వాలను కూలదోయటం అమెరికాకు ఇది తుదీ కాదు.. మొదలూ కాదు. భారీ జనవిధ్వంసక ఆయుధాలను దాస్తోందన్న ఆరోపణలతో ఇరాక్‌పై దాడి చేసి సద్దాంహుసేన్ ప్రభుత్వాన్ని అమెరికా కూల్చివేసింది. దీంతో మధ్యప్రాచ్యం అగ్నిగుండమైంది. జనవిధ్వంసక ఆయుధాలు ఇరాక్‌లో లేనేలేవని అంతర్జాతీయ అణుఇంధన సంస్థ నిపుణులు తేల్చిచెప్పినా తాననుకున్న విధంగా సైన్యాలను నడిపించి కీలుబొమ్మ ప్రభుత్వాన్ని ఏర్పాటుచేసింది. నిజానికి అమెరికా రెండో దాడి నాటికే (2003) ఇరాక్ అన్ని విధాలుగా బలహీనమైపోయింది. అమెరికా, యూరోపు దేశాలు విధించిన ఆంక్షలతో, యుద్ధనష్టాలతో అప్పటికే సంక్షోభంలో కూరుకుపోయింది. సాధారణ మందులు సైతం అందక లక్షలాది పసిపిల్లలు ప్రాణాలను కోల్పోయారు. అమెరికా నేతృత్వంలో ఆరంభమైన మొదటి గల్ఫ్ యుద్ధంతోనే (1990-91) ఇరాక్ నవనాడులూ కుంగిపోయాయి. ఏమీ చేయలేని దుస్థితిలో ఇరాక్ ఉందని తెలిసినా ఐక్యరాజ్యసమితి భద్రతామండలి ఆమోదం లభించకపోయినా అనుకున్నది చేసేశారు. అంతే.. అక్కడ కనీవినీ ఎరగని విధ్వంసం జరిగింది. అందులోంచి నుంచి ఐఎస్ఐఎస్ లాంటి ఇస్లామిక్ తీవ్రవాద సంస్థలు పుట్టుకొచ్చి దేశదేశాల్లో సమస్యలను సృష్టించాయి. అఫ్గానిస్థాన్‌లోకి ప్రవేశించిన (1979) సోవియట్ సైన్యాలను ఎదిరించటానికి.. ఇస్లాం ప్రమాదంలో పడిందంటూ ముజాహిదీ బృందాలను తయారుచేసి వెన్నుదన్నులు అందించటంతో మతతత్వ తీవ్రవాద భావజాలం 1980ల చివరినాటికే విపరీతంగా శక్తిని పుంజుకుంది. ఆ విపరిణామంలో అమెరికా నిర్వహించిన పాత్ర గురించి ఇప్పుడెవరికీ సందేహాల్లేవు. దానిపై వందలవేల విశ్లేషణలూ వచ్చాయి. 2003 నాటి ఇరాక్ లాగే ఇప్పటి వెనెజువెలా పరిస్థితి ఉంది. ఆర్థికంగా దిగజారిపోయింది. భద్రతాపరంగా ఎవరికీ ముప్పు కలిగించే పరిస్థితిలోనూ లేదు. మాదకద్రవ్యాల రవాణాకు ఉపయోగపడే మార్గాలకు వెనెజువెలా ఉపయోగపడుతున్నా వాటి ఉత్పత్తికి ఇప్పటికీ అది కేంద్రం కాదు. కొలంబియా నుంచి ఇతరచోట్లకు మాదకద్రవ్యాలను చేరవేయటానికి వెనెజువెలా పనికివస్తోంది. అందులో ఎలాంటి సందేహం లేదు. ఇందులో ప్రభుత్వాధినేత పాత్ర ఎంతో ఇదమిత్థంగా చెప్పలేం. కొందరు అధికారుల పాత్ర కచ్చితంగానే ఉండొచ్చు. కానీ నచ్చని ప్రభుత్వాలను మార్చటానికి దేశాధినేతలను దోషులుగా ముద్రవేయటం అమెరికా వ్యూహాల్లో ఎప్పుడూ కీలకంగానే ఉంటుంది. ఆర్థికవ్యవస్థలు అధోగతికి వెళుతున్నప్పుడు కొన్నిచోట్ల నిషేధిత మత్తుపదార్థాల వ్యాపారాలు విజృంభిస్తాయి. అఫ్గానిస్థాన్‌లో అదే జరిగింది. 1979 నుంచి ఇప్పటివరకూ అక్కడ ఏదో విధంగా రాజకీయ సంక్షోభం కొనసాగుతూనే ఉంది. ఆర్థిక వ్యవస్థ తీవ్ర ఒడుదుడుకుల్లోనే నడుస్తోంది. ముజాహిద్ బృందాలకు నిధులను సమకూర్చటానికి మత్తుపదార్థాల వ్యాపార రవాణాకు సీఐఏ అండదండలను అందించిందని అమెరికా జర్నలిస్టులే పరిశోధనాత్మక వ్యాసాలు రాశారు. ఒకనాటితో పోల్చితే ఆర్థికాభివృద్ధి పరంగా వెనుక పట్టుపట్టిన పంజాబులోనూ మత్తుపదార్థాల సమస్య తీవ్రంగానే ఉంది. దిగజారిన వెనెజువెలా ఆర్థిక పరిస్థితికి కారణమెవరని ప్రశ్నించుకుంటే వేలును ఒక్కవైపుగానే చూపించలేం. చమురు నిల్వలు పుష్కలంగా ఉన్న దేశం ఆర్థికంగా పతనం అంచున ఉండటం విచిత్రంగానే అనిపించినా వెనెజువెలా విషయంలో అది కఠోర వాస్తవం. 1999లో హ్యూగో రాఫెల్ చావెజ్ అధికారంలోకి రావటం వెనెజువెలాలోనే కాదు దక్షిణ అమెరికా దేశాల చరిత్రలోనే మేలుమలుపుగా పరిగణించే వ్యాఖ్యానాలు చాలా వచ్చాయి. 1990ల్లో ఊపందుకున్న సరళీకృత ఆర్థిక విధానాలను వ్యతిరేకించే వారందరికీ చావెజ్ ఆశాకిరణంలా కనపడ్డారు. వెనెజువెలాతో పాటు బ్రెజిల్, అర్జెంటీనా, బొలివియా, చిలీల్లో (2002-2006) సరళీకృత విధానాలను వ్యతిరేకించే, సంక్షేమ కార్యక్రమాలకు ఎక్కువ నిధులను ఖర్చుపెట్టాలని కోరుకునే నాయకులు అధికారంలోకి వచ్చారు. వాగ్దానాల ప్రకారం కొన్ని సంక్షేమ పథకాలను అమలుచేసినా కావాల్సిన స్థాయిలో ప్రభుత్వ ఆదాయాలను పెంచుకోలేకపోయారు. తీవ్రంగా నిధుల కొరతను ఎదుర్కోవాల్సి వచ్చింది. వెనెజువెలా పరిస్థితి ఘోరంగా దిగజారింది. చమురు అమ్మకాలపైనే ప్రధానంగా ఆధారపడుతూ ఇతర రంగాలను నిర్లక్ష్యం చేయటంతో వ్యవస్థ పూర్తిగా గాడితప్పింది. చమురు ధరలు తగ్గిపోయినప్పుడు ఏమీ చేయలేని దుస్థితిలో పడిపోయింది. దీనికి తోడు అమెరికాతో పాటు ఇతర దేశాలు విధించిన ఆర్థిక ఆంక్షలతో కనీవినీ ఎరగని సంక్షోభంలో కూరుకుపోయింది. 2014లో 482-500 బిలియన్ డాలర్ల విలువ ఉన్న జీడీపీ 2025 వచ్చేసరికి 100-115 బిలియన్ డాలర్లకు పడిపోయింది. రుణాలు జీడీపీ నిష్పత్తి 160 శాతానికి పెరిగింది. అంటే ఆదాయం వంద రూపాయలు ఉంటే రుణం 160 రూపాయలకు చేరింది. చమురు ఆదాయం బాగున్న కాలంలో (2000-2014) మొత్తం ప్రభుత్వ ఖర్చులో 45 శాతం నుంచి 65 శాతం వరకూ సంక్షేమ కార్యక్రమాలకు వెచ్చించారు.

# కార్యకర్తకు అండగా వాసుపల్లి రూ.5000 ఆర్థిక సాయం



**విశాఖపట్నం, (రాజధాని వార్తలు):** దక్షిణ నియోజకవర్గంలో పేద ప్రజల ఆపద్బాంధవుడు మాజీ ఎమ్మెల్యే దక్షిణ నియోజకవర్గ సమన్వ యకర్త వాసుపల్లి గణేష్ కుమార్ కార్యకర్తలకు అండగా నిలు స్తున్నారు. 39వ వార్డు సీహార్స్ జంక్షన్ దగ్గర సీనియర్ కార్యకర్త మహమ్మద్ మెహబూబ్ బేగం చనిపోవడంతో ఆ కుటుంబాన్ని పరామర్శించారు.

ఆమె భర్త సలీంకి ధైర్యం చెప్పి సొంత నిధులతో వాసుపల్లి గణేష్ కుమార్ రూ.5000 ఆర్థిక సహాయం అంద జేశారు. దక్షిణ వైసీపీ శ్రేణులకు, ప్రజలకు కష్టంలో తాను ఎప్పుడు అండగా ఉంటానని చెప్పారు. మెహబూబ్ బేగం అకాల మరణం పార్టీకి తీరని లోటు అన్నారు. ఆమె పార్టీలో ఉత్సాహంగా పనిచేసే వారిని గుర్తు చేశారు. బేగం కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలియజేస్తూ ఆత్మకు శాంతి కలగాలని వాసుపల్లి ఆకాంక్షంచారు. ఈ కార్యక్రమంలో 39 వ వార్డు అధ్యక్షుడు ముజీఫ్ ఖాన్, కార్పొరేటర్ చెన్నా జానకిరామ్, జిల్లా వైస్ ప్రెసిడెంట్ డేవిడ్ రాజు, సౌత్ మైనారిటీ సెల్ ప్రెసిడెంట్ బాబ్జి, వెంకటి, చేపల అప్పారావు, సౌత్ ఎస్సీ సెల్ ప్రెసిడెంట్ ఆకుల శ్యామ్,అది లక్ష్మి, చేపల ప్రసాద్,తిట్టి కృష్ణ,మాలతీ, ఈశ్వరి, ఆరుగులరాజు, అప్పలరాజు,కాసుబాబు, సీనియర్ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# జివిఎంసి "ప్రజా సమస్యల పరిష్కార వేదిక" లో 108 వినతులు

## - విశాఖ నగర మేయర్ పీలా శ్రీనివాసరావు



**విశాఖపట్నం, (రాజధాని వార్తలు):** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న "ప్రజా సమస్యల పరిష్కార వేదిక" కార్యక్రమంలో జీవీఎంసీలో అన్ని విభాగాలకు కలిపి 108 వినతులు వచ్చాయని నగర మేయర్ పీలా శ్రీనివాసరావు పేర్కొ న్నారు. సోమవారం ఆయన జివిఎంసి ప్రధాన కార్యాలయం పాత సమావేశ మందిరంలో జివిఎంసి కమిషనర్ కేతన్ గార్గ్‌తో కలసి ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని నిర్వహిం చారు. ఈ సందర్భంగా నగర మేయర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న"ప్రజా సమస్యల పరిష్కార వేదిక" కార్యక్రమానికి జివిఎంసికి సంబంధించి 108 అర్జీలు/ఫిర్యాదులు స్వీకరించడం జరిగిందని తెలిపారు. అందులో ముఖ్యంగా భీమిలి జోన్‌కు 01, మధురవాడ జోన్‌కు 12, ఈస్ట్ జోన్‌కు 20, వెస్ట్ జోన్‌కు 01, నార్త్ జోనుకు 12, సౌత్ జోన్‌కు 18, పెందుర్తి జోన్‌కు 08, అగనంపూడి జోన్‌కు 02, గాజువాక జోన్‌కు 12, అనకాపల్లి జోన్‌కు 01, జివిఎంసి ప్రధాన కార్యాలయానికి 21 ఫిర్యాదులు అందాయని తెలిపారు. అలాగే జివిఎంసి అడ్మినిస్ట్రేషన్ & అకౌంట్సు విభాగమునకు 17, రెవెన్యూ విభాగమునకు 12, ప్రజారోగ్య విభాగమునకు 07, పట్టణ ప్రణాళిక విభాగమునకు 42, ఇంజినీరింగు విభాగమునకు 28, మొక్కల విభాగమునకు 01, యుసిడి విభాగమునకు 01 కలిపి మొత్తంగా 108 ఫిర్యాదులు వచ్చాయని తెలిపారు. అనంతరం కమిషనరు మాట్లాడుతూ ఫిర్యాదులకు సంబంధించిన విభాగాధిపతులు ప్రజలు పెట్టుకున్న అర్జీలను/ఫిర్యాదులను అదే రోజు వెంటనే పరిశీలిస్తూ, సంబంధిత ఫిర్యాదుదారులతో సంప్రదించి నిర్ణీత సమయంలో పరిష్కరించాలని, వచ్చిన అర్జీలపై అధికారులు వెంటనే స్పందించి కార్యాచరణ అదే రోజు చేపట్టాలని, ప్రతివారం అదే ఫిర్యాదులు తిరిగి ప్రజలు సమర్పించకుండా ఆయా సమస్యలను నిర్ణీత సమయంలో పరిష్కరించాలని, పి జి ఆర్ ఎస్ కార్యక్రమం పూర్తయిన అనంతరం వచ్చిన ఫిర్యాదులపై అన్ని విభాగాల అధికారులు ఆయా వినతులపై ఫిర్యాదుదారులను సంప్రదించి వెంటనే సమస్యలను పరిష్కరించేలా చర్యలు చేపట్టాలని జివిఎంసి అధికారులను, జోనల్ కమీషనర్లను కమిషనర్ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ప్రధాన ఇంజనీర్ సత్యనారాయణరాజు, అదనపు కమిషనర్లు డి.వి.రమణ మూర్తి, ఎస్ ఎస్ వర్మ, ఇన్చార్జ్ ప్రధాన వైద్యాధికారి డాక్టర్ అప్పలనాయుడు, సిసిపి ఏ.ప్రభాకరరావు, డిసిఆర్ ఎస్.శ్రీనివాసరావు, ఇంచార్జి డిడిహెచ్ వాసుకి, ఎగ్జామినర్ ఆఫ్ అకౌంట్స్ సి.వాసుదేవ రెడ్డి, కార్యదర్శి బివి రమణ, స్పోర్ట్స్ డైరెక్టర్ ఇ.ఎ.రాజు, పర్యవేక్షక ఇంజనీర్లు, సిపి, డిసీపీలు, ఏసీపీలు, కార్యనిర్వాహక ఇంజినీర్లు, బయాలజిస్ట్, తదితరులు పాల్గొన్నారు.

# విశాఖలో తొలిసారిగా సైమా ప్రొఫెషనల్ బ్యూటీ ఎక్స్‌పో



**విశాఖపట్నం, (రాజధాని వార్తలు):** అందం, ఆరోగ్యం (బ్యూటీ అండ్ వెల్నెస్) రంగంలో అంతర్జాతీయ ప్రమాణాలను విశాఖ వాసులకు పరిచయం చేస్తూ సైమా - ప్రొఫెషనల్ బ్యూటీ ఎక్స్‌పో ఈ నెల 25, 26 తేదీలలో నగరంలోని పోర్ట్ కళావాణిలో ఘనంగా జరగనుంది. దీనికి సంబంధించిన అధికారిక పోస్టర్‌ను సోమవారం సాయంత్రం బీచ్ రోడ్డులోని సుప్రీం హోటల్‌లో నిర్వహించిన కార్యక్రమంలో మాజీ డిప్యూటీ మేయర్ దాడి సత్యనారాయణ ఆవిష్కరించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఇప్పటి వరకు దేశంలోని మెట్రో నగరాలకే పరిమితమైన ఇటువంటి ప్రతిష్టాత్మకమైన ప్రీమియం ఎక్స్‌పోను ఆంధ్రప్రదేశ్‌లో తొలిసారిగా విశాఖపట్నంలో నిర్వహించడం సంతోషదాయకమ న్నారు. ప్రపంచ వ్యాప్తంగా ఉన్న అంతర్జాతీయ బ్యూటీ నిపుణు లను, ప్రముఖ బ్రాండ్లను, పంపిణీదారులను ఒకే వేదికపైకి తీసుకురావడం ఈ ఎక్స్‌పో ప్రధాన ఉద్దేశమని తెలిపారు. ఎక్స్‌పో నిర్వాహకుడు మోక్ష మాట్లాడుతూ బ్యూటీ అండ్ వెల్నెస్ సెక్టార్‌లో వస్తున్న సరికొత్త మార్పులు, ఉత్పత్తులు ఆవిష్కరణలను ఇక్కడ ప్రదర్శించనున్నారు. ప్రఖ్యాత బ్యూటీ బ్రాండ్లు, స్కిన్ కేర్ సొల్యూషన్స్, హెయిర్ కేర్, కాస్మెటిక్స్, నెయిల్ కేర్ స్పా సేవలకు సంబంధించిన స్టాళ్లు సందర్శకులను అలరించనున్నాయి. కేవలం ప్రదర్శన మాత్రమే కాకుండా, నిపుణుల ద్వారా ప్రత్యేక వర్క్‌షాప్‌లను కూడా నిర్వహించనున్నారు. తద్వారా ఔత్సాహికులు నూతన మెళకువలను నేర్చుకునే అవకాశం ఉంటుందని నిర్వాహకులు తెలిపారు. బ్యూటిషన్ కోర్స్ ద్వారా మహిళలు తమ కాళ్ళపై నిలబడి ఉపాధి పొందెందుకు కృషి చేస్తున్నామని తెలిపారు. దీనిని పాఠ్యాంశాలుగా చేరిస్తే బాగుంటుందని అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమంలో మన్యం వీరుడు చిత్ర నిర్మాత, హీరో ఆర్.వి.వి. సత్యనారాయణ, బిఎన్‌ఏ ఏపీ డైరెక్టర్ జాస్మిన్, గీత గోవాడ, సినీ నటుడు రవితేజ, ఇతర ముఖ్యులు పాల్గొని కార్యక్రమ విశేషాలను వివరించారు. ఈ ఎక్స్‌పో విశాఖలోని బ్యూటీ రంగానికి కొత్త ఊపునిస్తుందని వారు ఆశాభావం వ్యక్తం చేశారు.




# దొరికిన సెల్ ఫోను అప్పగింత

## - ఎస్.ఐ కే.కిరణ్ కుమార్ నాయుడు



**గజపతినగరం, (రాజధాని వార్తలు):** స్థానిక మెంటాడ రోడ్డులోని ఆటో స్టాండ్ ప్రాంతంలో సోమవారం గురాన రామకృష్ణ అనే వ్యక్తి తనకు దొరికిన సెల్‌ఫోను స్థానిక సబ్ ఇన్స్పెక్టర్ కే కిరణ్ కుమార్ నాయుడుకు అప్పగించారు. కొత్త బగ్గాశీ గ్రామానికి చెందిన గురాన రామకృష్ణ నిజాయితీని ఎస్సై కిరణ్ కుమార్ నాయుడు అభినందించారు. దొరికిన ఈ మోటో ఆండ్రాయిడ్ మొబైల్లో ఎటువంటి సిమ్ము లేదని, ఈ ఫోను పోగొట్టుకున్న వ్యక్తులు ఎవరి దగ్గరైనా ఫోనుకు సంబంధించి ఏమైనా డాక్యుమెంట్స్ ఉన్నట్లయితే, వాటిని పోలీస్ స్టేషన్‌కి తీసుకుని వస్తే ఫోన్ అందజేయడం జరుగుతుందని ఎస్సై కిరణ్ కుమార్ నాయుడు ఈ సందర్భంగా తెలిపారు.

# విశాఖపట్నం సిటీ ఫోర్త్ టౌన్ క్రైమ్ పోలీస్ స్టేషన్‌ను ప్రారంభించిన నగర పోలీసు కమీషనర్ డా.శంఖబ్రత బాగ్చి



**విశాఖపట్నం, (రాజధాని వార్తలు):** పోలీస్ స్టేషన్ గతంలో తుఫాను సమయములో చెట్లు కూలి శిథిలమైనది తరువాత దీనిని శాశ్వత ప్రాతిపదికన నిర్మించుటకు సిపి నిధులు మంజూరి చేసినారు. ప్రస్తుతము ఈ భవనము అధునాతన నిర్మా ణము చేయబడినది అధికారులు మరియు సిబ్బంది సంతృప్తికరముగా పనిచేయుటకు కావలసిన సౌకర్యములు అందించబడినవి. ఈ కార్యక్రమంలో సిపి మాట్లాడుతూ మిగిలిన పోలీస్ స్టేషన్లో వాటి యొక్క జీవిత కాలము పెంచుటకు మరియు సిబ్బంది సౌకర్య వంతముగా విధులు నిర్వర్తించుటకు కావలసిన మరమ్మతులు మరియు అదనపు సౌకర్యాలు కల్పిస్తామని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో డి.సి.పి-01 మణికంఠ చెందోలు ఐ.పి.ఎస్. డిసిపి (క్రైమ్స్) లతా మాధురి ఐ.పీ.ఎస్. ఏసీబీ (క్రైమ్స్) ఏ.నరసింహ మూర్తి ఇతర అధికారులు పాల్గొన్నారు.

# వెంకటేశ్వరునికి ఘనంగా లక్ష తులసి పూజలు



**పెద్దాపురం, (రాజధాని వార్తలు):** ధనుర్మాస పూజల్లో భాగంగా పెద్దాపురం పట్టణంలోని శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయంలో స్వామివారికి లక్ష తులసి పూజ, పంచామృతాభిషేకాలు సోమవారం ఘనంగా నిర్వహించారు. ఆలయ కార్య నిర్వహణ అధికారి జగదీశ్వరరావు, ఆలయ ధర్మ కర్తల మండల చైర్మన్ జల్లూరి వీర్రాజుల ఆధ్వర్యంలో వేకువ జాబు నుండి మధ్యాహ్నం వరకు విశేష పూజలు చేపట్టారు. వెంకటేశ్వర స్వామి దశావతార పూజల్లో భాగంగా కొనసాగుతున్న ధనుర్మాస పూజల్లో స్వామి వారికి ప్రత్యేక పూజలు చేపట్టారు. వందలాది మంది మహిళ భక్తులు లక్ష తులసి పూజల్లో పాల్గొన్నారు. ఆలయ పండితులు వేద పండితులు ఈ పూజలను శాస్త్రోక్తంగా నిర్వహిం చారు. పూజలో పాల్గొన్న భక్తులకు ప్రత్యేక ప్రసాదా లను ఆలయ అధికారులు అందజేశారు. లక్ష తులసి పూజ సందర్భంగా భక్తులతో ఆలయం నిండుకొని కోలాహలంగా మారింది. ఈ పూజలో ఆలయ ధర్మకర్తలు, ఆలయ సిబ్బంది పాల్గొని భక్తులకు సేవలు అందించారు.

# జన నాయగన్.. ఆయన నోరు మూయించాడు మరి ఇప్పుడు..?




దళపతి విజయ్ చివరి సినిమా జన నాయగన్ సినిమా ఈ సంక్రాంతికి రిలీజ్ అవుతుంది. ఐతే రీసెంట్‌గా ఈ సినిమా ట్రైలర్ రిలీజ్ చేశారు మేకర్స్. హెచ్. వినోద్ డైరెక్షన్‌లో తెరకెక్కుతున్న ఈ సినిమా అనిల్ రావిపూడి బాలకృష్ణ కాంబినేషన్‌లో వచ్చిన భగవంత్ కేసరి రీమేక్‌గా వస్తుందని తెలుస్తుంది. జన నాయగన్ ట్రైలర్ చూస్తే దాదాపు అది కన్ఫర్మేషన్ వచ్చేసింది. ఐతే భగవంత్ కేసరి డైరెక్టర్ అనిల్ రావిపూడి మాత్రం దాన్ని చాలా సీక్రెట్‌గా ఉంచుతూ వచ్చారు. లాస్ట్ ఇయర్ సంక్రాంతికి వస్తున్నాం సినిమా ఈవెంట్‌లోనే వీటీవీ గణేష్ దళపతి విజయ్‌ని డైరెక్ట్ చేసే ఛాన్స్ అనిల్ రావిపూడికి వచ్చింది అంటూ జన నాయగన్ రీమేక్ పై హింట్ ఇచ్చాడు. ఐతే పక్కనే ఉన్న అనిల్ ఆయన ఆపమని అది వాళ్లు రీమేక్ అని అనౌన్స్ చేయాలి అని అన్నారు. ఐతే అనిల్ రావిపూడి రీసెంట్ ఇంటర్వ్యూస్‌లో కూడా దీని గురించి చెప్పలేదు. జన నాయగన్ ట్రైలర్ చూస్తే భగవంత్ కేసరి మూల కథకు విజయ్ పొలిటికల్ ఎజెండా నేపథ్యం తీసుకుని తెరకెక్కించారని తెలుస్తుంది. ఐతే అనిల్ రావిపూడి ఈ సినిమా విషయంలో ఎందుకు అంత కన్ ఫ్యూజింగ్ స్టేట్మెంట్స్ ఇస్తున్నారు అన్నది ఎవరికీ అర్థం కావట్లేదు. ఐతే జన నాయగన్ ట్రైలర్ చూసిన వాళ్లు వీటీవీ గణేష్ అప్పుడే చెప్పాడు కదా అని అనుకుంటున్నారు. అనిల్ రావిపూడి మాత్రం జన నాయగన్ తన సినిమా రీమేక్ అని ఎక్కడ చెప్పలేదు. ఆ సినిమా గురించి పూర్తి బాధ్యత వాళ్లదే కాబట్టి వాళ్లు ఎలా చేస్తారు ఎలా మార్చేస్తారు అన్నది వాళ్ల ఇష్టమే అని అనిల్ రావిపూడి అన్నారు. సో భగవంత్ కేసరి రీమేక్ గానే జన నాయగన్ వస్తుందని క్లియర్‌గా తెలుస్తున్నా అనిల్ రావిపూడి ఈ కన్ ఫ్యూజ్ స్టేట్మెంట్స్ వెనక అసలు రీజన్ ఏంటన్నది ఆడియన్స్‌కి అర్థం కావట్లేదు. ఐతే ఈ సంక్రాంతికి అనిల్ రావిపూడి మన శంకర వరప్రసాద్ సినిమాతో వస్తున్నాడు. మెగాస్టార్ చిరంజీవి లీడ్ రోల్‌లో నటించిన ఈ సినిమాలో నయనతార హీరోయిన్‌గా నటించింది. సినిమాలో విక్టరీ వెంకటేష్ కూడా స్పెషల్ క్యామియో రోల్ చేశారు. టాలీవుడ్‌లో సక్సెస్ ఫుల్ డైరెక్టర్‌గా అనిల్ రావిపూడి తన హవా కొనసాగిస్తున్నారు. పటాస్ నుంచి సంక్రాంతికి వస్తున్నాం వరకు తీసిన 8 సినిమాలు సక్సెస్ అందుకున్నాడు అనిల్ రావిపూడి. మన శంకర వరప్రసాద్‌తో డబల్ హ్యాట్రిక్ టార్గెట్ పెట్టుకున్నారు.

# 1 నేనొక్కడినే ట్రైలర్.. వెనక ఏం జరిగింది..?



సూపర్ స్టార్ మహేష్ సుకుమార్ కాంబినేషన్ లో వచ్చిన సినిమా 1 నేనొక్కడినే. ఈ కాంబో మీద ఉన్న అంచనాలకు సినిమా బ్లాక్ బస్టర్ కొట్టేస్తుందని అనుకున్నారు. అంతేకాదు ఈ సినిమాలో మహేష్‌తో పాటు వారసుడు గౌతం కృష్ణ కూడా అందులో క్యామియో చేశాడు. ఇన్ని అంశాలు ఉన్న ఈ సినిమా 2014 సంక్రాంతికి వచ్చి నిరాశ పరిచింది. సినిమా చూసిన సూపర్ స్టార్ ఫ్యాన్స్ మహేష్ యాక్టింగ్‌కి ఫిదా అయినా కూడా సినిమా ఫలితం డిజప్పాయింట్ చేసింది. ఐతే ఆ సినిమా టైంలో ట్రైలర్ రిలీజ్ చేయకపోవడం వెనుక ఉన్న కారణం నిర్మాత అనిల్ సుంకర బయట పెట్టారు. 1 నేనొక్కడినే సినిమాకు మొదటిసారి లైవ్ ట్రైలర్ రిలీజ్ చేద్దామని దేశం మొత్తం కొన్ని థియేటర్స్‌లో ఏర్పాటు చేశామని.. ఐతే ఆడియో రిలీజ్ టైంలో ఫ్యాన్స్‌తో మహేష్ మాట్లాడటం కూడా అదే మొదటిసారి.. ఐతే ఇక ట్రైలర్ రిలీజ్ చేసే టైంలో ఈ ట్రైలర్ రిలీజ్ చేస్తే ఓపెనింగ్స్ మీద ఎఫెక్ట్ పడుతుందని ఎవరో అన్నారు. దాని వల్ల ఆ ట్రైలర్ రిలీజ్ చేయలేదు. ఆ తర్వాత క్రిస్ మస్‌కి ఒక యాక్షన్ కట్ టీజర్‌ని రిలీజ్ చేశాం.. ఐతే సినిమా చూసిన ఆడియన్స్ షాక్ అయ్యారు. ఆ తర్వాత మేమంతా ముందే కథ ట్రైలర్‌లో చెప్పి ఉంటే కాస్త ఎంగేజ్ అయ్యే వారని అనుకున్నామని నిర్మాత అనిల్ సుంకర చెప్పారు. రాజమౌళి ముందే కథ చెప్పేస్తారు.. అలా చేయాల్సింది కానీ కుదరలేదని అన్నారు. 1 నేనొక్కడినే సినిమా టెక్నికల్‌గా హై ఉంటుంది. కానీ ఆ సినిమాకు ఆడియన్స్‌ని ప్రిపేర్ చేయడంలో డైరెక్టర్ సుకుమార్ ఫెయిల్ అయ్యాడు. సినిమా ఎలా ఉంటుంది అన్నద్ది ఆడియన్స్‌కి ముందే ఒక హింట్ ఇస్తే అదే అంచనాలతో ఉండే వాళ్లు. అలా ట్రైలర్ లేకుండా రిలీజ్ చేయడం వల్ల సినిమా మీద హ్యూజ్ ఎక్స్‌పెక్టేషన్స్ ఉండటం వల్ల 1 సినిమా రిజల్ట్ అలా వచ్చింది. అఫ్కోర్స్ సినిమా డిజప్పాయింట్ చేసినా మహేష్ బాబు నటన, సుకుమార్ టేకింగ్‌కి ప్రశంసలు వచ్చాయి. ఐతే ఆ సినిమా గురించి ఇప్పటికీ ఆడియన్స్‌లో ఒక సెపరేట్ డిస్కషన్ జరుగుతుంది. ఈ సినిమాలో దేవి శ్రీ ప్రసాద్ మ్యూజిక్ సినిమాకు మంచి హైప్ ఇచ్చింది. కేవలం సినిమా కథ ఇది అని ముందే ఆడియన్స్‌కి ఒక హింట్ ఇవ్వకపోవడం వల్లే సినిమా ఆడియన్స్‌కి ఎక్కలేదని ఈ సినిమా నిర్మాతలు ఇప్పటికీ చెబుతున్నారు.

# ప్రభాస్ రాజా సాబ్..డ్యాన్స్‌తోనే హైప్ పెంచేశాడుగా!



టాలీవుడ్ స్టార్ హీరో ప్రభాస్.. మరికొన్ని రోజుల్లో ది రాజా సాబ్ మూవీతో థియేటర్స్‌లోకి రానున్నారు. డైరెక్టర్ మారుతి తెరకెక్కిస్తున్న ఆ సినిమా కామెడీ హారర్ ఫాంటసీ ఎంటర్టైనర్‌గా జనవరి 9వ తేదీన విడుదల కానుంది. దీంతో మేకర్స్ ఇప్పుడు ఏర్పాట్లు పూర్తి చేస్తున్నారు. సినిమాను గ్రాండ్‌గా వరల్డ్ వైడ్‌గా రిలీజ్ చేయనున్నారు. అయితే ఇప్పటికే రాజా సాబ్‌పై భారీ అంచనాలు నెలకొన్నాయి. ముఖ్యంగా రీసెంట్‌గా మేకర్స్ రిలీజ్ చేసిన ట్రైలర్ అందరినీ ఆకట్టుకుంది. అంచనాలను ఫుల్‌గా పెంచేసింది. అదే సమయంలో నాచే నాచే పాట కూడా సినిమాపై హైప్ క్రియేట్ చేయడంలో ముఖ్య పాత్ర పోషించింది. ముందు ప్రోమో రాగా.. రీసెంట్‌గా మేకర్స్ ఫుల్ సాంగ్‌ను రిలీజ్ చేశారు. ముందు నాచే నాచే ప్రోమో వచ్చినప్పుడే ఓ రేంజ్ లో రెస్పాన్స్ వచ్చింది. ముఖ్యంగా నార్త్ మూవీ లవర్స్‌ను విపరీతంగా అలరించింది. ఎనర్జిటిక్ బీట్‌తో కంపోజ్ చేసిన ఆ పాట.. ఇన్ స్టంట్ చార్ట్ బస్టర్‌గా నిలిచింది. ఆడియన్స్‌కు వెంటనే కనెక్ట్ అయిపోయింది. సాంగ్‌లోని హుక్ స్టెప్.. సినీ ప్రియులను ఫిదా చేసేసింది. నార్త్ మూవీ లవర్స్ ఫేవరెట్ సాంగ్స్‌లో ఒకటిగా స్థానం సంపాదించుకుంది. అన్నింటి కన్నా సాంగ్‌లో ప్రభాస్‌తో పాటు ముగ్గురు హీరోయిన్లు మాళవిక మోహనన్, రిద్ధి కుమార్, నిధి అగర్వాల్ డ్యాన్స్ చేయడం స్పెషల్ అట్రాక్షన్‌గా నిలిచింది. ఇది చాలా అరుదైన విజువల్ కావడంతో.. సాంగ్ గ్రాండ్ ఫీలింగ్‌ను ఇస్తోంది. అదే సమయంలో విజువల్స్, భారీ సెట్స్, స్టైలిష్ కాస్ట్యూమ్స్ అన్నీ కలిసి పాటకు హై వాల్యూ తీసుకొచ్చాయి. ప్రభాస్ స్టెప్పులు చూస్తే ఆయనలోని మాస్ ఎనర్జీ మరోసారి బయట పడినట్టు కనిపించింది. అభిమానులు చాలా కాలంగా ఆయనను ఫుల్ ఫ్లెడ్జ్ డ్యాన్స్ మోడ్‌లో చూడాలని ఎదురుచూస్తుండగా, ఆ కోరిక పాటతో నెరవేరింది. ఇటీవల సినిమాల్లో స్వాగ్‌తో నడిచిన ప్రభాస్, ఈసారి పూర్తిగా హై ఎనర్జీ డ్యాన్స్‌తో సందడి చేశారు.

కొరియోగ్రఫీ కూడా ఆయన స్టైల్‌కు తగ్గట్టుగా డిజైన్ చేయడంతో, ప్రతి స్టెప్ ప్రేక్షకులను ఆకట్టుకునేలా ఉంది. ముఖ్యంగా సోషల్ మీడియాలో పాటకు వస్తున్న స్పందన చూస్తుంటే.. యూత్‌కు తెగ మెప్పించిందని చెప్పడంలో నో డౌట్. ఏదేమైనా ఇప్పటికే నార్త్‌లో సూపర్ క్రేజ్ సంపాదించుకున్న ప్రభాస్.. ఇప్పుడు రాజా సాబ్ విషయంలో సాంగ్‌తోనే హైప్ ఎక్కించేశారు. ఎలాంటి ప్రమోషనల్ ఈవెంట్ లో పాల్గొననప్పటికీ.. నాచే నాచే పాటతో అందరి దృష్టిని ఆకర్షించారు. మరి నార్త్ లో రాజా సాబ్‌తో డార్లింగ్ ఎలాంటి హిట్ అందుకుంటారో వేచి చూడాలి.

# బన్నీ బ్రాండ్.. స్టెప్ బై స్టెప్ ఎదగడమంటే ఇదేనేమో!



ఇండియన్ ఫిల్మ్ ఇండస్ట్రీలో హీరో అల్లు అర్జున్ పేరు ఇప్పుడు కేవలం నేమ్ కాదు.. ఒక బ్రాండ్ అనే చెప్పాలి. ఒకప్పుడు కేవలం తెలుగు ప్రేక్షకులకే పరిమితమైన తన స్టార్ ఇమేజ్‌ను ఇంటర్నేషనల్ లెవెల్‌కు పెంచుకున్నారని చెప్పడంలో ఎలాంటి డౌట్ అక్కర్లేదు. స్టెప్ బై స్టెప్, బ్రిక్ బై బ్రిక్ తన కెరీర్‌ను నిర్మించుకుంటూ ఇప్పుడు పాన్ ఇండియా స్టార్‌గా మారారని చెప్పాలి. నిజానికి.. అల్లు అర్జున్ ప్రయాణం సాధారణంగా మొదలై అసాధారణంగా మారింది. టాలీవుడ్‌లో వివిధ సినిమాలతో మెప్పించిన ఆయన, మాలీవుడ్ మార్కెట్‌లో డబ్బింగ్ మూవీతో క్రేజ్ సంపాదించుకున్న తెలుగు తొలి హీరోగా నిలిచారు. ఆర్య సినిమా మలయాళంలో డబ్బింగ్ రూపంలో విడుదలై అక్కడి ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకుంది. అప్పటి వరకు మలయాళ మార్కెట్‌లో తెలుగు హీరోలకు అంత పెద్దగా క్రేజ్ లేదనే చెప్పాలి. కానీ అల్లు అర్జున్ స్టైల్, డాన్స్, స్క్రీన్ ప్రెజెన్స్ మాలీవుడ్ ప్రేక్షకులను ఫుల్‌గా ఆకట్టుకున్నాయి. అక్కడి నుంచి ఆయనకు సౌత్‌లో తొలి బలమైన అడుగు పడింది. ఆ తర్వాత కేవలం ఒక ఇండస్ట్రీకే పరిమితం కాకుండా, దేశవ్యాప్తంగా పుష్ప మూవీతో గుర్తింపు పొందారు. సుకుమార్ దర్శకత్వంలో తెరకెక్కిన ఆ చిత్రం, కేవలం సినిమా మాత్రమే కాదు.. బన్నీకి ఒక ఫెనామెనాన్‌గా మారింది. హిందీ బెల్ట్‌లో అల్లు అర్జున్‌కు ఊహించని స్థాయిలో అభిమానులను తెచ్చిపెట్టింది. దీంతో బన్నీ నేషనల్ స్టార్‌గా మారిపోయారు. అక్కడితో ఆగలేదు. పుష్ప 2తో ఆయన క్రేజ్ మరింత పెరిగింది. సినిమా విడుదలకు ముందే దేశవ్యాప్తంగా భారీ అంచనాలు ఏర్పడ్డాయి. ముఖ్యంగా బిహార్‌లో నిర్వహించిన ఈవెంట్ చరిత్రలో నిలిచిపోయేలా జరిగింది. ఆ ఒక్క ఈవెంట్‌తో పుష్ప 2 స్థాయి పూర్తిగా మారిపోయిందని చెప్పాలి. అసలు ఆశ్చర్యం జపాన్ మార్కెట్. తెలుగు హీరోగా అక్కడ భారీ క్రేజ్ సంపాదించుకోవడం చాలా అరుదైన విషయం. అల్లు అర్జున్ పుష్ప సినిమాతో జపాన్ ప్రేక్షకులను కూడా ఆకట్టుకున్నారు. అక్కడి నుంచి ఇండియా, ఓవర్సీస్ మార్కెట్లలో ఆయనకు ప్రత్యేక స్థానం ఏర్పడింది. ఇది బన్నీ ప్లానింగ్‌కు పెర్ఫెక్ట్ ఎగ్జాంపుల్. ఇప్పుడు అల్లు అర్జున్ దృష్టి కోలీవుడ్‌పై పడింది. తమిళ ఇండస్ట్రీలో బలమైన మాస్ ఇమేజ్ ఉన్న ప్రముఖ డైరెక్టర్ అట్లీతో కలిసి బన్నీ చేస్తున్న సినిమా.. సూపర్ హీరో కాన్సెప్ట్‌తో రూపొందుతుంది. దీంతో ఆ భారీ ప్రాజెక్టు.. ఇది కేవలం తమిళ మార్కెట్‌నే కాదు.. అంతర్జాతీయ మార్కెట్‌ను కూడా టార్గెట్ చేసిన సినిమాగా మారే అవకాశముంది. మొత్తంగా చూస్తే మాలీవుడ్ నుంచి మొదలై, పాన్ ఇండియా, జపాన్, ఓవర్సీస్, ఇప్పుడు కోలీవుడ్ వరకు.. అల్లు అర్జున్ ప్రయాణం ఒక క్లియర్ ప్లాన్‌తో సాగుతోంది. రాజ్యాలను ఒక్కొక్కటిగా జయించే రాజులా, ఒక్కో మార్కెట్‌ను తనదైన శైలిలో ఆకట్టుకుంటూ ముందుకు వెళుతున్నారు. భవిష్యత్తులో ఆయన అన్ని ఇండస్ట్రీలను ఏలుతారా? అలెగ్జాండర్ స్థాయిలో పేరు సంపాదిస్తారా? అన్నది కాలమే చెప్పాలి.

# చిన్న పత్రికలపై చిన్నచూపు తగదు - కలెక్టరేట్ వద్ద వినతి



**విజయనగరం, (రాజధాని వార్తలు):** విజయనగరం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించిన ఃస్పందనః కార్యక్ర మంలో చిన్న, మధ్యతరహా పత్రికల ప్రతినిధులు తమ నిరసనను వ్యక్తం చేశారు. భోగాపురం ఎయిర్‌పోర్ట్ వంటి ప్రతిష్టాత్మక కార్యక్ర మానికి జిల్లాలో ఉన్న చిన్న మధ్యతరహా పత్రికల రిపోర్టర్లకు కవరేజ్ చేసేందుకు పిలుపు రాకపోవడం ఎంతో దురదృష్టకరమని ఆవేదన వ్యక్తం చేశారు. స్థానిక విలేకరులను విస్మరించి, ఇతర జిల్లాల నుంచి కవరేజ్ కోసం పిలవడం ఎంతవరకు సమంజస మని వారు ప్రశ్నించారు. ఈ మేరకు రాష్ట్ర మంత్రి కొండపల్లి శ్రీనివాస్, జిల్లా కలెక్టర్ ఎస్.రామసుందర్ రెడ్డిలకు వినతిపత్రం అందజేశారు. ప్రభుత్వ సంక్షమ కార్యక్రమాల ప్రచారంలోనూ, అధికారిక కార్యక్రమాల్లోనూ చిన్న పత్రికల పట్ల వివక్ష చూపవద్దని, అందరికీ సమాన ప్రాధాన్యత ఇవ్వాలని డిమాండ్ చేశారు. ముఖ్యంగా ప్రభుత్వ కార్యక్రమాలకు సంబంధించిన ప్రెస్ నోట్‌లు సమాచార శాఖ నుంచి చాలా ఆలస్యంగా అందుతున్నాయని, దీనివల్ల వార్తలను సకాలంలో కవర్ చేయడం కష్టమవుతోందని వారు పేర్కొన్నారు. సమాచార శాఖ స్పందించి ప్రెస్ నోట్‌లను కాస్త త్వరగా పంపాలని కోరారు.

**మంత్రి, కలెక్టర్ సానుకూల స్పందన**

చిన్న పత్రికల ప్రతినిధులు లేవనెత్తిన సమస్యలపై రాష్ట్ర మంత్రి కొండపల్లి శ్రీనివాస్, జిల్లా కలెక్టర్ ఎస్. రామసుందర్ రెడ్డి సానుకూలంగా స్పందించారు. ఈ విషయాలపై తక్షణమే సమాచార శాఖ అధికారులతో మాట్లాడి, సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ప్రెస్ నోట్‌లు సకాలంలో అందేలా చూస్తామని, స్థానిక చిన్న పత్రికల మనుగడకు మరియు ప్రాధాన్యతకు అవసరమైన సహకారం అందిస్తామని స్పష్టం చేశారు.

# ఫిబ్రవరి 15 లోపు అనుబంధ సంఘాల కమిటీలు నియమించాలి : మాజీ ఎమ్మెల్యే బొత్స అప్పల నరసయ్య

**గజపతినగరం, (రాజధాని వార్తలు):** నియోజకవర్గంలోని అన్ని మండలాల్లో అనుబంధ సంఘాల కమిటీల నియామకాలు ఫిబ్రవరి 15వ తేదీలోపు పూర్తి చేయాలని మాజీ ఎమ్మెల్యే, వైకాపా నియోజకవర్గ ఇన్చార్జ్ బొత్స అప్పలనరసయ్య అన్నారు.ఆదివారం స్థానిక వైసీపీ కార్యాలయంలో నియోజవర్గ స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రాష్ట్ర పార్టీ ఆదేశాల మేరకు అనుబంధ కమిటీల నియామకాలు త్వరిత గతిన చేపట్టాలన్నారు. పార్టీలో నిరంతరం శ్రమించే వారికి కమిటీల్లో అవకాశశీ కల్పించాలన్నారు. కష్టపడి పనిచేసే వారికి ఎల్లవేళలా గుర్తింపు ఉంటుందన్నారు. అందరూ సమన్వయంతో పనిచేసి బలమైన కమిటీలను ఏర్పాటు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో గజపతినగరం మండల నాయకులు మండల సురేష్, కరణం ఆదినారాయణ, జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షులు పీరుబండి జైహింద్ కుమార్, పార్టీ అధ్యక్షులు బూడి వెంకటరావు, జడ్పిటిసి గార తవుడు, పార్టీ నాయకులు బెల్లాన త్రినాధరావు, మాజీ



ఏఎంసీ చైర్మన్ వేమలి ముత్యాల నాయుడు, మాజీ ఎంపీపీ కంది తిరుపతి నాయుడు, బొండపల్లి మండల పార్టీ అధ్యక్షులు బొద్దల చిన్నం నాయుడు, వివిధ మండలాల ఎంపీపీలు, జడ్పీటీసీలు, పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# విద్యార్థులు క్రమశిక్షణ గల జీవితాన్ని అలవర్చుకోవాలి : మెజిస్ట్రేట్ ఏ.విజయ్ రాజ్ కుమార్



**గజపతినగరం, (రాజధాని వార్తలు):** విద్యార్థి దశ నుంచే విద్యార్థులు క్రమశిక్షణ గల జీవితాన్ని అలవర్చుకోవాలని స్థానిక ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ ఏ. విజయ్ రాజ్ కుమార్ అన్నారు. సోమవారం స్థానిక శ్రీకృష్ణ విద్యాపీఠ్ హై స్కూల్లో మండల లీగల్ సర్వీసెస్ కమిటీ ఆధ్వర్యంలో హైకోర్టు ఆదేశాల మేరకు జాతీయ యువజన ఉత్సవాలను పురస్కరించుకొని అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, క్రమశిక్షణ గల జీవితం విద్యార్థి ఉన్నతికి తోడ్పడుతుందన్నారు. మాదక ద్రవ్యాలను విస్మరించే సమాజం నిర్మించాలని అన్నారు. అనవసరమైన ప్రలోభాలకు లోను కాకుండా చదువుపై దృష్టి పెట్టాలన్నారు. బాల్యవివాహాల నిర్మూలన కోసం ప్రతి ఒక్కరు తమ వంతు కృషి చేయాలన్నారు. అలాగే విద్యార్థులకు పలు ముఖ్యమైన సూచనలు చేశారు. విద్యార్థి దశ నుంచే నేర్చుకోవాల్సిన విలువలపై ప్రసంగించారు. చట్టాలపై అవగాహన అవసరాన్ని తెలిపారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదులు పి.ఆదినారాయణ, సీర వాసు, ప్రిన్సిపల్ లక్ష్మ, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# నూతనంగా నిర్మించనున్న ఎంఈఓ కార్యాలయానికి మంత్రి శంకుస్థాపన





**మక్కువ, (రాజధాని వార్తలు):** మక్కువలో నూతనంగా 53 లక్షల రూపాయల వ్యయంతో నిర్మించ తలపెట్టిన ఎంఈఓ కార్యాలయానికి సోమవారం నాడు శంకుస్థాపన కార్యక్రమానికి మంత్రి గుమ్మడి సంధ్యారాణి హాజరై ఆమె చేతుల మీదుగా శంకుస్థాపన నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆశీస్సులతో ఆంధ్రప్రదేశ్ అభివృద్ధి పథంలో దూసుకుపోతుందని అన్నారు. ప్రత్యేకంగా విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ విద్యా శాఖలో అనేక మార్పులు తీసుకువచ్చి అభివృద్ధి పథంలో నడిపిస్తున్నారు వారికి కృతజ్ఞతలు అని తెలిపారు. అలాగే ఈ కార్యక్రమంలో రైతులకు సులభంగా భూ సేవలో భాగంగా పట్టాదారు పాసుపుస్తకాల పంపిణీ చేశారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వం అందజేస్తున్న పట్టాదారు పాసు పుస్తకాలపై ప్రభుత్వ రాజముద్రతో కూడిన వాటిని అందజేయడం జరుగుతుంది అని తెలిపారు.

కూటమి ప్రభుత్వం బాధ్యతాయు తమైన పాలన నిర్ణయాత్మకమైన చారిత్రాత్మక నిర్ణయాలు తీసుకుం టూ రాష్ట్ర సర్వతోముఖ అభివృద్ధికై అనునిత్యం పాటుపడుతుం దని తెలియజేశారు. అతి దగ్గరలోనే మక్కువ రోడ్లు పనులు ప్రారంభమవుతాయని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మక్కువ మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు గుల్ల వేణుగోపాలరావు ఎంపీటీసీ తీళ్ళ పోలినాయుడు అలాగే మక్కువ మండలం తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకుడు డాక్టర్ పి మల్లేశ్వరరావు పార్టీ యువ నాయకుడు దాసరి కేశవరావు మరియు పార్టీ కార్యకర్తలు అధికారులు పాల్గొన్నారు.

# సి ఎం ఆర్ ఎఫ్ లబ్ధిదారులకు రూ.6,00,122 ల విలువైన చెక్కులను అందించిన మంత్రి కొండపల్లి శ్రీనివాస్





**గజపతినగరం, (రాజధాని వార్తలు):** ఆపదలో ఉన్న బాధితులను అదుకోవడంలో తమ ప్రభుత్వం ఎల్లప్పుడూ ముందుంటుందని రాష్ట్ర ఎంఎస్ఎమ్ఈ, సెర్ప్, ఎన్ఆర్ఐ వ్యవహారాల శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ అన్నారు. సీఎం సహాయ నిధి నుండి మంజూరైన ఆర్థిక సహాయానికి సంబంధించిన రూ. 6,00,122ల విలువైన తొమ్మిది చెక్కులను లబ్ధిదారులకు సోమవారం మంత్రి శ్రీనివాస్ అందజేశారు. గజపతినగరం మండలం కొనిస గ్రామానికి చెందిన సిరికి సన్యాసప్పడుకు రూ. 1,20,624లు బొండపల్లి మండలం కొండకిండాం గ్రామానికి చెందిన నక్కాన అప్పలనాయుడు రూ. 1,06,746లు గజపతి నగరం మండలం ఎం కొత్తవలస గ్రామానికి చెందిన జమ్మన యశ్వంత్ రూ. 90,000లు గజపతినగరం మండలం కాలం రాజుపేట గ్రామానికి చెందిన గవర అప్పలనరసమ్మ రూ. 35,000/-లు. గజపతినగరం మండలం ముచ్చర్ల గ్రామానికి చెందిన సనపతి తమ్మి నాయుడు రూ. 50,000లు. గజపతినగరం మండలం ఎం గుమడాం గ్రామానికి చెందిన సుంకరి సూర్యనారాయణ రూ. 51,365లు. గజపతినగరం మండలం కొనిస గ్రామానికి చెందిన వాసిరెడ్డి పైడిపు నాయుడు రూ. 70,000లు దత్తిరాజేరు మండలం దాసుపేట గ్రామానికి చెందిన మరడపు ఈశ్వరరావు రూ. 35,000లు. బొండపల్లి మండలం ఎం కొత్తవలస గ్రామానికి చెందిన మజ్జి సీతమ్మ రూ. 41,387లు. వీరందరూ అనారోగ్య సమస్యతో వివిధ ఆసుపత్రులలో చికిత్స పొందివున్నారు. మంత్రి కొండపల్లి శ్రీనివాస్ సిఫార్సుతో ముఖ్యమంత్రి సహాయనిధికి దరఖాస్తు చేసుకోగా వీరికి రూ. 6,00,122/- లు ఆర్థిక సాయం మంజూరు చేశారు. రాష్ట్ర ముఖ్యమంత్రి కార్యాలయం నుంచి జారీచేసిన తొమ్మిది చెక్కులను మంత్రి కొండపల్లి శ్రీనివాస్ చేతుల మీదుగా లబ్ధిదారులకు విజయనగరంలోని మంత్రి క్యాంపు కార్యాలయంలో అందజేశారు.

ఈ కార్యక్రమంలో ఏయంసి చైర్మన్ గోపాలరాజు, గజపతినగరం మండల పార్టీ అధ్యక్షురాలు గంట్యాడ శ్రీదేవి, జిల్లా పార్టీ ఉపాధ్యక్షులు మక్కువ శ్రీధర్, గంట్యాడ మాజీ మండల అధ్యక్షుడు కొండపల్లి కొండలరావుతోపాటు లబ్ధిదారులు, వారి అనుయాయులు తదితరులు పాల్గొన్నారు.

# మంత్రి కొండపల్లి చొరవతో గెద్దపేట గ్రామానికి రేషన్ పంపిణీ కేంద్రం

**బొండపల్లి, (గజపతినగరం),(రాజధాని వార్తలు):** మండల కేంద్ర మైన బొండపల్లి పంచాయతీ గెద్దపేట గ్రామానికి మంత్రి కొండ పల్లి చొరవతో రేషన్ పంపిణి కేంద్రం మంజూరు అయినది. ఈ మేరకు ఆదివారం గెద్దపేట గ్రామంలో నూతనంగా మంజూరైన రేషన్ పంపిణి కేంద్రంను బొండపల్లి పీ,ఏ.సి.ఎస్.అధ్యక్షులు బుద్ధరాజు సత్యనారాయణ రాజుతో పాటు పలువురు నాయకులు ప్రారంభించారు. కాగా గెద్దపేట నుండి బొండపల్లి సుమారు రెండు కిలోమీటర్లు గల దూరాన్ని లబ్దిదారులు నడిచి వచ్చి రేషన్ డిపో నుండి నిత్యావసర సరుకులు తీసుకునే పరిస్థితులు ఉండేవి. వర్షాకాలం, వేసవికాలంలో నిత్యావసర సరుకులు తీసుకొనేందుకు వృద్దులు, వికలాంగులు, అనారోగ్యం పాలైన వాళ్ళు నానా ఇబ్బందులు పడుతుండేవారు. లబ్దిదారులు ఎదుర్కొంటున్న సమస్యలను రాష్ట్ర చిన్నతరహ పరిశ్రమలు, సెర్ప్, ఎన్.ఆర్ఐ.సాదికారిత మంత్రి కొండపల్లి శ్రీనివాస్ దృష్టికి తీసుకువెళ్లగా వెంటనే స్పందించిన మంత్రి కొండపల్లి జిల్లా అధికారులతో మాట్లాడి గెద్దపేట గ్రామానికి రేషన్ పంపిణి కేంద్రంను మంజూరు చేయించారు. ఇది ఇలా ఉండగా పీ.ఏ.సి.ఎస్. అధ్యక్షులు బుద్ధరాజు సత్యనారాయణ రాజు మాట్లాడుతూ గ్రామస్తులు ఐకమత్యంతో ముందుకు రావాలని అప్పుడే సత్వర అభివృద్ధి జరుగుతుందని అన్నారు. ప్రభుత్వం అమలుచేస్తున్న రీ సర్వేను రైతులు ఉపయోగించుకోవాలని కోరారు. కాగా నూతన రేషన్ పంపిణి కేంద్ర ప్రారభోత్సవ కార్యక్రమంలో పీ.హెచ్ సి మాజీ చైర్మెన్



మాసారపు పోలినాయుడు, మాజీ ఎం.పీ టి సి సభ్యులు పట్నాన శ్రీనివాసరావు, సీనియర్ టిడిపి నాయకులు, జంపన సూర్యనారాయణరాజు, ఉప్పలపాటి చిరంజీవిరాజు, పంచాయతీ వార్డు సభ్యులు ఆల్తి పోలమ్మ తదితరులు పాల్గొన్నారు.

# ఎస్.బీ.ఐలో నగదు కొరత... అవస్థలు పడ్డ ఖాతాదారులు





**గజపతినగరం, (రాజధాని వార్తలు):** స్థానిక స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బీఐ) ప్రధాన శాఖలో ఈ ఏడాది జనవరి 1 నుంచి 5 రోజులుగా నగదు కొరత నెలకొంది. దీంతో నగదు తమ ఎకౌంటులోంచి తీసుకోవడానికి వచ్చిన ఖాతాదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రోజు బ్యాంకుకు నగదు కోసం రావడం, నిరాశగా వెనుతిరగడంతో ఖాతాదారులు విసిగిపోతున్నారు.అవసరాల కోసం తమ ఖాతాల్లో ఉన్న డబ్బును తీసుకునేందుకు బ్యాంకుకు వెళ్తే నగదు అందుబాటులో లేదని సిబ్బంది చేతులెత్తేస్తున్నారని ఖాతాదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయంపై బ్యాంకు అధికారులను ప్రశ్నించినా స్పష్టమైన సమాధానం ఇవ్వలేకపోతున్నారని ఆరోపిస్తున్నారు. పండగ సమయం కావడంతో చాలామంది ఖాతాదారులకు నగదు అవసరం ఏర్పడింది. అదేవిధంగా రైతులు కూడా తమ ఎకౌంట్లో ధాన్యం అమ్మగా వచ్చిన నగదును చూసి మురిసిపోవడమే తప్ప తీసుకోవడానికి వీలు కాలేదని వాపోయారు. ఆకస్మికంగా ఏర్పడిన ఈ పరిస్థితిపై ఖాతాదారులు తీవ్ర విమర్శలు చేస్తున్నారు.

**బ్యాంక్ మేనేజర్ వివరణ:**

ఈ విషయమై బ్యాంక్ మేనేజర్ సూర్యప్రకాష్‌ను ప్రశ్నించగా, డిసెంబర్ 31 నాటికే బ్యాంకులో ఉన్న నగదు అంతా ఉద్యోగుల జీతాలకు, పింఛన్దారులకు చెల్లించడం జరిగిందని, నగదు కొరత విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీస్కుళ్లి, ఇండెంట్ పెట్టడం జరిగిందని మంగళవారం కల్లా నగదు వచ్చే అవకాశం ఉందన్నారు. ఖాతాదారులు, వ్యాపారులు డిపాజిట్ చేస్తున్న నగదుతో కొంతమేరకు సర్దుబాటు చేస్తున్నామని తెలిపారు.

# శ్రీ బాలాభాను అర్చక పురోహిత సంఘం కార్యవర్గ సభ్యులచే విశాఖ నగర పోలీస్ కమిషనర్‌కు ఘనమైన సత్కారం




**విశాఖపట్నం, (రాజధాని వార్తలు):** నగర పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చి డీజీగా పదోన్నతి పొందిన నేపథ్యంలో బాలభాను అర్చక, పురోహిత సంఘం ఘనంగా సత్కరించింది సోమవారం సాయంత్రం సంఘం అధ్యక్ష కార్యదర్శులు జోస్యుల కామేశ్వర శర్మ, మావుదూరు కిషోర్ కుమార్ శర్మ ఆధ్వర్యంలో కార్యవర్గ సభ్యులు సిపిని దుస్సాలువతో ఘనంగా సత్కరించారు. అంతకు ముందు సిపి నగర పోలీసు కమీషనర్ డా.శంఖబ్రత బాగ్చి సంఘం ఆధ్వర్యంలో ముద్రించిన క్యాలెండర్‌ను ఆవిష్కరిం చారు. కార్యవర్గ సభ్యులు నగర పోలీసు కమీషనర్‌కు జ్ఞాపికను వేద ఆశీర్వచనాలు అందజేశారు.

# టిడిపి అధ్యక్షకార్యదర్శులకు గంట్ల సత్కారం



**విశాఖపట్నం, (రాజధాని వార్తలు):** విశాఖ జిల్లా తెలుగు దేశం పార్టీ పార్లమెంట్ అధ్యక్షలుగా నియమితులైన చోడే వెంకట పట్టాభిరామ్ ప్రధాన కార్యదర్శి లొడగల కృష్ణలను సోమవారం జాతీయ జర్నలిస్టుల సంఘం కార్యదర్శి ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్టులు ఫెడరేషన్ నాయకులు డాక్ యార్డ్ కేటీబీ అసోసియేషన్ అసోసియేషన్ గౌరవ అధ్యక్షులు గంట్ల శ్రీనుబాబు మర్యాదపూర్వకంగా కలుసుకుని ఘనంగా సత్కరించారు. విశాఖ జిల్లా తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో గంట్ల శ్రీను బాబు మాట్లాడుతూ క్రమశిక్షణ గల కార్యకర్తగా కార్పొరేటర్‌గా నాయకుడిగా పట్టాభి అంచలంచెలుగా ఈ స్థాయికి ఎదిగారు అన్నారు. భవిష్యత్తులో వీరు మరిన్ని పదవులు అధిరోహించాలని గంట్ల శ్రీనుబాబు ఆకాంక్షంచారు. ఈ కార్యక్రమంలో ఎన్టీఆర్ వైద్య సేవల చైర్మన్ సీతం రాజు సుధాకర్, విశాఖ జిల్లా టిడిపి మీడియా కన్వీనర్ బి పోతన రెడ్డి పాల్గొన్నారు.


# స్టీల్ పరిశ్రమల పర్యావరణ స్థిరత్వంపై సీతంలో ప్రత్యేక అవగాహన కార్యక్రమం




**విజయనగరం, (రాజధాని వార్తలు):** సత్య ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ మేనేజ్‌మెంట్ మెకానికల్ ఇంజినీరింగ్ విభాగం ఆధ్వర్యంలో "స్టీల్ పరిశ్రమలో పర్యావరణ స్థిరత్వం" అంశంపై ప్రత్యేక ఉపన్యాసం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కళాశాల పూర్వ విద్యార్థి మరియు ప్రస్తుతం విశాఖపట్నంలోని ఆర్సెలార్ మిట్టల్ నిప్పాన్ స్టీల్ ఇండస్ట్రీస్‌లో డిప్యూటీ మేనేజర్‌గా పనిచేస్తున్న శ్రీ జి వి డి రేవంత్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఉపన్యాసంలో స్టీల్ పరిశ్రమలో స్థిరత్వం అవసరం, పర్యావరణ పరిరక్షణలో పరిశ్రమల బాధ్యతలను ఆయన వివరించారు. స్టీల్ ప్లాంట్ యొక్క పూర్తి ఫ్లో చార్ట్, ఐరన్ ఓర్ మరియు కోల్ ప్రిపరేషన్ విధానాలు, బ్లాస్ట్ ఫర్నేస్ ప్రక్రియలు మరియు వాటి ద్వారా ఉత్పత్తి అయ్యే గ్యాసుల పునర్వినియోగాన్ని విద్యార్థులకు వివరించారు. చిన్నకాల లక్ష్యలుగా శక్తి వినియోగ సామర్థ్యాన్ని పెంచడం, బ్లాస్ట్ ఫర్నేస్ గ్యాసులను విద్యుత్ ఉత్పత్తికి వినియోగించడం, నీటి వినియోగాన్ని తగ్గించడం వంటి అంశాలను ప్రస్తావించారు. దీర్ఘకాల లక్ష్యలుగా కార్బన్ ఉద్గారాలను గణనీయంగా తగ్గించడం, గ్రీన్ స్టీల్ తయారీ, పునరుత్పాదక శక్తి వినియోగాన్ని పెంపొందించడం, నెట్–జీరో ఉద్గారాల సాధనను పర్యావరణ నిబంధనల అమలు వంటి అంశాలను ఆయన చర్చించారు. ఈ ఉపన్యాసం విద్యార్థులకు పరిశ్రమల వాస్తవ పరిస్థితులపై అవగాహన కల్పించడంతో పాటు స్థిరమైన ఇంజినీరింగ్ దిశగా ఆలోచించేలా ప్రోత్సహించిందని అధ్యాపకులు తెలిపారు. ఈ సందర్భంగా సత్య విద్యాసంస్థల డైరెక్టర్ డాక్టర్ మజ్జి శశిభూషణ్ మాట్లాడుతూ, స్టీల్ పరిశ్రమలో స్థిరత్వం, పర్యావరణ పరిరక్షణ మరియు వనరుల సమర్థ వినియోగం భవిష్యత్ ఇంజినీర్లకు అత్యంత అవసరమని పేర్కొన్నారు. సీతం కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ డీ వి రామూర్తి మాట్లాడుతూ, లీనియర్ ఎకానమీ నుంచి సర్క్యులర్ ఎకానమీ వైపు మార్పు విద్యార్థులకు అవగాహన కలగడం ఎంతో ముఖ్యమని తెలిపారు. మెకానికల్ ఇంజినీరింగ్ విభాగాధిపతి సీ హెచ్ వెంకటలక్ష్మ మాట్లాడుతూ, పరిశ్రమ అనుభవంతో కూడిన ఇలాంటి ఉపన్యాసాలు విద్యార్థుల సాంకేతిక నైపుణ్యాలు మెరుగుపరుస్తాయని తెలిపారు.

# క్యాటరర్స్ సమస్యలను పరిష్కరించాలి: అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు వరదరాజులు






**నెల్లూరు, (రాజధాని వార్తలు):** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వ్యాప్తంగా ఉన్నటువంటి క్యాటరర్స్‌లకు ప్రభుత్వ సహకారం ఎంతో అవసరమని వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు వరదరాజులు పేర్కొన్నారు. నెల్లూరు నగరంలోని స్థానిక సెట్టిగుంట రోడ్డు, మైపాడు గేట్ సెంటర్ ప్రాంతంలో ఉన్న ఆర్ఆర్ మినీ ఫంక్షన్ హాల్‌లో సోమవారం క్యాటరర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి రాష్ట్రంలోని నలుమూల నుండి అసోసియేషన్ ప్రతినిధులు పాల్గొనగా, ముఖ్య అతిధులుగా అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు వరదరాజులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వివిధ శుభకార్యాలకు కస్టమర్స్ కోరిన విధంగా, వీక్షకులు నచ్చే విధంగా క్యాటరింగ్ వంటకాలను కస్టమర్‌లకు అందజేస్తూ సంతృప్తికరమైన సేవలు అందిస్తున్నామని సంతోషంలో క్యాటరర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులు ఉంటున్నారు. అయితే రోజు రోజుకి పెరిగిపోతున్న నిత్యవసర సరుకుల ధరలను అదుపులోకి తీసుకు రావాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. ఈ క్రమంలో ప్రభుత్వం సహకార అందిస్తే పప్పు దినుసులు మరియు నాణ్యమైన నమ్మకమైన మన్నిక గల బియ్యం, నాణ్యత గల నూనె తదితర వంట సామాగ్రితో పాటు క్వాలిటీ పసుపు, కారం పొడిలను అందుబాటులోకి తీసుకొచ్చేందుకు ప్రభుత్వం తమ వంతు సహకారం అందించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ముఖ్యంగా క్యాటరర్స్ ఆర్థికంగా నిలబడాలంటే ప్రభుత్వం నిర్దిష్టమైన రేట్లను అమలు చేయవలసిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్రవ్యాప్తంగా వివిధ జిల్లాలోని క్యాటరర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆర్ఆర్ క్యాటరింగ్ అధినేత తాళ్లూరి రాము మాట్లాడుతూ క్యాటరర్స్ ఎట్టకేలకు ఒకే త్రాటిపైకి రావడం అదృష్టంగా భావిస్తున్నామన్నారు. ఈ సందర్భంగా అసోసియేషన్ సాధారణ సభ్యత్వం మరియు జీవిత కాల సభ్యత్వాలను స్వీకరించిన వారందరినీ ఘనంగా సన్మానించారు. ఈ సమావేశంలో అసోసియేషన్ ప్రతినిధులతో పాటు



స్థానికులు తదితరులు పాల్గొన్నారు.

# స్వాన్ స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో మెగా బ్లడ్ డొనేషన్ క్యాంప్






**నెల్లూరు, (రాజధాని వార్తలు):** నెల్లూరు నగరంలోని ఇరుకళల అమ్మవారి దేవస్థానం సులోచన ఎన్ క్లేవ్. పరమేశ్వరి నగర్ నందు ఆదివారం స్వాన్ స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో మెగా రక్తదాన శిబిరం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రెడ్ క్రాస్ క్యాన్సర్ హాస్పటల్ అంకాలజికల్ సర్జన్ డాక్టర్ ముత్తు. తెలుగుదేశం పార్టీ రూరల్ బీసీ సెల్ అధ్యక్షుడు కుంచాల విజయ్ భాస్కర్. శివాజీ యూత్ ఫౌండేషన్ సీఈవో మోపూరు భాస్కర్ నాయుడు రక్తదాత నీలకంఠం శ్రీనివాసులురెడ్డి విచ్చేసి రక్తదాన శిబిరాన్ని ప్రారంభించారు అదేవిధంగా ఎముకలు వ్యాధితో బాధపడుతున్న మహమ్మద్ సోహెల్ కి స్వాన్ స్వచ్ఛంద సేవా సంస్థ వారు నిత్యావసర సరుకులు అందజేశారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ నూతన సంవత్సరంలో స్వాన్ స్వచ్ఛంద సేవ సంస్థ మొట్టమొదటగా ఈరోజు అద్భుతమైన రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేయడం చాలా సంతోషంగా ఉంది అదేవిధంగా ఎముకలు వ్యాధితో బాధపడుతున్న మహమ్మద్ సోహెల్‌కి నిత్యవసర సరుకులు ఆర్థిక సహాయాన్ని అందజేయడం ఎంతో సుగుచూచికం గతంలో స్వాన్ ఎన్నో సేవా కార్యక్రమాలు నిర్వహించారు.

అలాగే ప్రతి నెల క్యాన్సర్ పేషెంట్లకు కూడా నిత్యవసర సరుకులు అందిస్తున్నారు ఎప్పుడు ఎక్కడ రక్తం అవసరం ఉన్నా కూడా నోవా బ్లడ్ బ్యాంక్ ప్రత్యేకంగా 24×7 రక్తాన్ని అందిస్తామంటూ తెలియజేస్తూ మన స్వాన్ స్వచ్ఛంద సేవా సంస్థ విశ్వగురు ఓల్డ్ రికార్డ్స్ వారి అవార్డుని స్వాన్ స్వచ్ఛంద సేవా సంస్థ అందుకోబోతోంది వాళ్లందరికీ శుభా కాంక్షలు తెలియజేస్తూ రానున్న రోజుల్లో జిల్లాస్థాయి కాదు రాష్ట్ర స్థాయి కేంద్రస్థాయి అవార్డును కూడా భానుతేజ రెడ్డి నాయకత్వంలో మిత్రులందరికీ తీసుకోవాలని కోరుకుంటూ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో స్వాన్ అధ్యక్షులు భానుతేజ రెడ్డి. చందు. జనార్ధన్. బాబు. ఈశ్వర్. సుభాన్. కార్తీక్. సాయి చరణ్ తదితరులు పాల్గొన్నారు.

# సింహపురి సోషల్ సర్వీస్ ఆధ్వర్యంలో ఘనంగా నీలం కృష్ణ రెడ్డి జన్మదిన వేడుకలు




**నెల్లూరు, (రాజధాని వార్తలు):** సింహపురి సోషల్ సర్వీస్ ఆధ్వర్యంలో ఎన్.ఆర్ మీట్ మార్ట్ అధినేత నీలం కృష్ణ రెడ్డి జన్మదిన సందర్భంగా షేక్ ఇర్ఫాన్ సహకారంతో స్వర్ణదీపం చారిటబుల్ ట్రస్ట్ వికలాంగులు, అనాధలు వృద్ధుల వసతి గృహము నందు ఎన్0.ఆర్ చేతుల మీదుగా కేక్ కటింగ్ మరియు అన్నదాన కార్యక్రమం చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో సింహపురి సోషల్ సర్వీస్ ఫౌండర్ షేక్ నయమతుల్లా, సాజిద్, ఖలీద్, మున్వర్, సాహిల్, ఇర్ఫాన్ తదితరులు పాల్గొన్నారు.

# శ్రీ పోలేరమ్మ అమ్మకు పనబాక లక్ష్మి ప్రత్యేక పూజలు

**నాయుడుపేట, (రాజధాని వార్తలు):** నాయుడుపేట పట్టణంలోని శ్రీ పోలేరమ్మ ఆలయంలో సోమవారం జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షురాలు పనబాక లక్ష్మి సూళ్లూరుపేట ఎమ్మెల్యే డాక్టర్ నెలవల విజయశ్రీ స్థానిక నాయకులతో కలిసి ప్రత్యేక పూజలు చేశారు. తొలుత ఆలయానికి విచ్చేసిన పనబాక లక్ష్మి, ఎమ్మెల్యే డాక్టర్ నెలవల విజయశ్రీ, భీమవరం సర్పంచ్ నెలవల అమృత సరళలకు ఆలయ కమిటీ చైర్మన్ నానబాల సుబ్బారావు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అనంతరం వారికి శాలువాలు కప్పి పూలమాలలు వేసి ఘనంగా సన్మానించారు. ఆలయ పూజారిలు అమ్మవారికి పూజలు చేసి టీడీపీ జిల్లా అధ్యక్షురాలు పనబాక లక్ష్మి, ఎమ్మెల్యే డాక్టర్ నెలవల విజయశ్రీలతోపాటు స్థానిక కూటమి పార్టీ నాయకులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో నాయుడుపేట ఏఎంసీ చైర్మన్, జనసేన పార్టీ సూళ్లూరుపేట నియోజకవర్గ ఇన్చార్జ్ ఉయ్యాల ప్రవీణ్, తెలుగు దేశం పార్టీ నాయకులు పార్థసారథి, కట్టా వెంకటరమణారెడ్డి, నాగిరెడ్డి చంద్రశేఖర్ రెడ్డి, పోట్ల పూడి రాజేష్, ఓజిలి మండల టిడిపి అధ్యక్షులు జి విజయకుమార్ నాయుడు, నాయుడుపేట మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ మైలారి శోభారాణి, కురుగొండ పిఎసిఎస్ చైర్ పర్సన్ దారా అంకయ్య, కందల కృష్ణారెడ్డి, శ్రీరామ్ ప్రసాద్, శ్రీ పోలేరమ్మ ఆలయ కమిటీ చైర్మన్ నానబాల సుబ్బారావు, తెలుగుదేశం పార్టీ నాయకులు మైలారి రాజశేఖర్, పసల గంగా ప్రసాద్, వేలూరు మురళీకృష్ణారెడ్డి, అవధానం సుధీర్, గూడూరు సుధీర్ రెడ్డి, కాపులూరు చక్రపాణి, హైమావతి పలువురు నాయకులు పాల్గొన్నారు.

# RAJADHANI CLASSIFIEDS Ad. Call
# 9440662699, rajadhanivartalu.com

## EDUCATIONAL

- కల్లం ఇంజనీరింగ్ కాలేజీ, గుంటూరు, 0863-2119726
- యస్ ఆర్ ఐ అకాడమీ ఆఫ్ సైన్సెస్ అండ్ హాస్పిటల్, మంగళగిరి 08645-230101
- ఎయిమ్స్ హాస్పిటల్, మంగళగిరి 9493065718
- యస్ ఆర్ యమ్ యూనివర్సిటీ, ఏపీ నీరుకొండ, 0863-2429299
- విట్ యూనివర్సిటీ, ఏపీ, ఐనవోలు, 0863-2370444
- IVY Overseas, Vijayawada 73375 55680
- VIVA School, Nambur 0866 668 8999
- అరవింద స్కూల్ వేర్ ఈచ్ చైల్డ్ ఈజ్ స్పెషల్, మంగళగిరి 08645-246878
- Eurekha Child, An AID India Initiative, Chennai 89398 20480
- Adarsha Educational Society Visakhapatnam, 0891-287 4605
- SPRITS Colleges, Kadapa, 9848664650
- Centuriaon University Rollavaka, AP 9840015963

## HOSPITALS

- అష్రఫ్ మెటర్నిటీఇ అండ్ టి మల్టీ స్పెషాలిటీ హాస్పటల్, విజయవాడ డా.యం.ఏ. రెహమాన్, 0866-2475087
- చింతలూరు ఆయుర్వేదం డాక్టర్ డి.విశ్వనాథ్, 9032990138
- హాసిని మల్టీ స్పెషాలిటీ హాస్పటల్ మందడం, డా. రహీమ్ బాషా 87902 27564
- శాస్త్రి బామ్ ఆయుర్, మంగళగిరి, 7999959999
- Manipal Hospitals, Vijayawada, 0866-2469700
- Sri Sivanath Ayurvedic Clinic Vijayawada, 09440 162256
- Rushad Opticals,Mangalagiri 99667 87654

## MATRIMONIAL

- కావ్యశ్రీ మ్యారేజ్ లింక్స్:1వ, 2వ,లేట్ మ్యారేజెస్, తోడు,సంబధాలు, డైవోర్సీస్, విడోస్, డోయర్స్,పెన్షనర్లకు,అన్ని కులాల వారికీ పోస్ట్ సెటిల్మెంట్లు(స్త్రీలకు ఫ్రీ రిజిస్ట్రేషన్) ఫోన్: 9100669324
- జానీ మ్యారేజ్ లింక్స్, విజయవాడ 985394613
- Post your Alliances ad on Rajadhani Vartalu NewsPaper
- Post your Alliances ad on rajadhanivartalu.com

## REAL ESTATE

- New Sneha Builders & Developers, Kurnool, AP 9440662699
- గాలిసా రియల్ ఎస్టేట్, అమరావతి 9440662699
- Apartments for Sale, Attractive Price,Crystal Constructions, Gated Community, NRI Hospital Road, Srinivasam Apartments, Mangalagiri, 9440662699
- ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల పరస్పర సహాయ సహకార గృహనిర్మాణ సంఘం, 0866-2452129
- ప్రైమ్ లివింగ్ రియల్ ఎస్టేట్ మంగళగిరి, 994860855

## NGO's

- శ్రీ శారదా పీఠం, విశాఖపట్నం 0891-2763332
- జ్ఞానసందం, ఐనవోలు చర్చ్ 8790878542
- ఇమ్మానుయేల్ చర్చ్, ఐనవోలు 9866777439
- Christian Rights Protection Service of India, Vijayawada 79897 88645
- రామయ్య చారిటబుల్ ట్రస్ట్ ప్రెసిడెంట్ బి.రమేష్, మంగళగిరి 0863-999999

## RESTAURENTS

- New Continental Park Hotel Vijayawada, 0866-6679999
- అయ్యూబ్ బిర్యానీ హౌస్, ఇబ్రహీంపట్నం 9502727306
- Hotel Ilapuram, Vijayawada 0866-2575251
- Lemontree Premier, Vijayawada, 0866-6919999
- Bismilla Biryani Point Tadepalli, 6300096288
- Khaleel Bhai Family, Restaurent, Guntur 855087555
- Novotel,Vijayawada 0866-6688999
- నాని స్వీట్స్, మంగళగిరి 8374220220, 9989229799
- Lakshmi Mourya Malkapuram, 9052631122
- Seweet Magic, Mangalagiri 9059323334
- Hello Idly, Mangalagiri 95424 93333
- Chill Out Restaurent Undavalli, 8179549922
- Hotel Park Residency Vijayawada-81216 69996

## COMPANIES

- ఈ-కామర్స్ కన్సల్టింగ్ నవీన్, 9008640610
- Insurence needs for NRI's Call 6305479394
- Hareesh Video Shooting 9666643567
- S RICE Traders Vijayawada 9849741984
- రవికాంత్, ఐటీ కన్సల్టింగ్ 9908188454
- ఎడ్వాంటెక్స్ స్మార్ట్ సొల్యూషన్స్, మంగళగిరి 0866-2466675
- ఐవిస్ ఇ-సర్వీసియన్సు కంపెనీ మంగళగిరి, 040-40038590
- నవీన్ ఈకామర్స్ కన్సల్టింగ్ 9008640610
- యూ యస్ ఎ స్మార్ట్ డీల్స్ గ్లోవ్స్ మాస్క్స్ 001-2489965595
- సిహెచ్.చంద్రశేఖర రెడ్డి, ది నూతక్కి ప్రాథమికవ్యవసాయ సహకార పరపతి సంఘం లిమిటెడ్, 08645-275239
- ఇన్కమ్ టాక్స్ ప్రాక్టీషనర్లు మంగళగిరి, 789998999
- Visakha Healthcare 92466 46561
- Vivanta, Vijayawada 0866 664 4444
- Minerva Grand 0866 667 8888
- Rain Tree Park, Nambur, ijmprop.com
- Echo Friendly Bags, Hyderabad-92461 69069
- ఏపీ యస్ యస్ డి సి హెల్ప్ లైన్ తాడేపల్లి, 8004252422
- Sri Venkateswara panbrokers, Guntur 0863-2228628
- మధు గ్రాఫిక్స్ డిజైనర్, హైదరాబాద్ 6303728907
- AICA Events, 9133133688
- శ్రీ దుర్గా డిజైనర్స్ లేడీస్ టైలర్స్ మంగళగిరి, 9959308664
- Madeena Trading Company Vijayawada, 9000628426
- పొట్లాబత్తుని శ్రీకాంత్ లక్ష్మి సారీస్, మంగళగిరి 08645-234002
- డిజిటల్ ఎక్స్‌పోనెంట్స్, కిషోర్ digitalexponents.in 7793903754
- చైతన్య జి.జి బ్యాంక్, రాయపూడి గుంటూరు జిల్లా, 08645-244266
- ఏపీ యస్ ఆర్ టి హెల్ప్ లైన్ తాడేపల్లి, 0863-2340678
- జవహర్ ఆటోనగర్ ఆటోమొబైల్ టెక్నికల్ అసోసియేషన్ 9394139239, 8143444459
- Capital Way Residency, Tadepalli, 9493523232
- Lemon Tree Hotel, Vijayawada, 866 691 9999
- For Classifieds ad, Call 9440662699
- Rajadhani Real Estate Plots,Amaravati, AP Buy / Sell 9440662699

RAJADHANIVARTALU.COM
9440662699


# స్వచ్ఛ గ్రామాలుగా తీర్చిదిద్దేందుకు అవగాహన కల్పించాలి

**గూడూరు, (రాజధాని వార్తలు):** గ్రామీణ ప్రాంతాల ప్రజలకు స్వచ్ఛ గ్రామాలుగా రూపొందించుకునేందుకు తీసుకునే చర్యల గురించి క్షేత్రస్థాయిలో అవగాహన కల్పించాలని డిఎల్డిఓ వాణిరెడ్డి పేర్కొన్నారు. సోమవారం గూడూరు మండల పరిధిలోని కందలి గ్రామ పంచాయతీలో పంచాయతీ సర్పంచ్ బల్లి వెంకటేశ్వర్లు అధ్యక్షతన వికసిత్ భారత్- గ్యారంటీ ఫర్ రోజ్ గార్ అండ్ ఆజీవికా మిషన్ (గ్రామీణ్) విబి జి రామ్ జి పై ప్రత్యేక గ్రామ సభను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా హాజరైన డిఎల్‌డివో మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు గ్రామాల్లో జాతీయ మహాత్మా గ్రామీణ ఉపాధి హామీ పథకానికి బదులుగా నూతనంగా రూపొందించిన వికాశిత్ భారత్ గ్యారెంటీ ఫర్ జీ గార్ అండ్ అజీ వికా మిషన్ ద్వారా ఉపాధి పని దినాలను వంద రోజుల నుండి 125 రోజులకు పెంచిన విషయాన్ని వివరించారు. అనంతరం స్వచ్ఛ సంక్రాంతి సభను నిర్వహించారు. ఎంపీడీవో గ్రామాల యొక్క స్వచ్ఛత విబిజి రాంజీ యొక్క ఆవశ్యకతను గూర్చి వివరించారు. ఈ కార్యక్రమంలో ఏపీవో, పంచాయతీ కార్యదర్శి తదితరులు పాల్గొన్నారు.




# విద్యుత్ చార్జీల భారం పడకుండా ట్రూ డౌన్ చార్జీలకు చర్యలు : ఎమ్మెల్యే

**సామర్లకోట, (రాజధాని వార్తలు):** ప్రజలపై విద్యుత్ చార్జీల భారం పడకుండా రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు దేశంలోనే తొలిసారిగా విద్యుత్ ఛార్జీల తగ్గింపు చర్యలు తీసుకున్నారని పెద్దాపురం ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప పేర్కొన్నారు. సామర్లకోట మండలం అచ్చంపేట క్యాంపు కార్యాలయంలో ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో ఎమ్మెల్యే చినరాజప్ప మాట్లాడుతూ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుండి ప్రజలకు సుపరిపాల నందిస్తూ మన్ననలు పొందుతుందన్నారు. ఆర్థిక పరిస్థితి అంతంత మాత్రమే ఉన్నప్పటికీ ప్రజా సంక్షమాన్ని దృష్టిలో ఉంచుకొని ఇచ్చిన హామీలు ఇవ్వని హామీలను కూడా అమలు చేస్తూ రాష్ట్రాన్ని అభివృద్ధి దిశగా పరుగులు పెట్టిస్తున్నారన్నారు. తాజాగా 2019 - 24 మధ్య కాలానికి సంబంధించి రూ. 4,498 కోట్లు ట్రూ ఆఫ్ చార్జీలు వసూలు చేసేందుకు ఏపీఆర్సి కూటమి ప్రభుత్వానికి లేఖ రాయగా సీఎం చంద్రబాబు ఈ భారాన్ని ప్రభుత్వమే భరిస్తుందని చెప్పడం ఒక చారిత్రిక నిర్ణయం అన్నారు. గత వైసిపి పాలనలో 9సార్లు విద్యుత్ ఛార్జీలు పెంచి దాదాపు రూ. 32 వేల కోట్లు భారం ప్రజలపై జగన్ మోపడన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు సీఎం చంద్రబాబు విద్యుత్ చార్జీలు పెంచకుండా విద్యుత్ వ్యవస్థను గాడిలో పెట్టేందుకు సంస్కరణలు చేపడుతుంద న్నారు. ట్రూ డౌన్ అమలు ద్వారా విద్యుత్ చార్జీల్లో



యూనిట్కు 13 పైసలు తగ్గించిన ఘనత కూటమి ప్రభుత్వానికే దక్కిందన్నారు. జగన్ పాలంలో ఆక్వా రైతులకు యూనిట్కు మూడున్నర రూపాయలు వసూలు చేస్తే, కూటమి ప్రభుత్వం రూపాయి నర మాత్రమే వసూలు చేస్తుందన్నారు. జగన్ పాలనలో యూనిట్‌కు రూ. 5.19 లు చెల్లిస్తే, కూటమి ప్రభుత్వం వచ్చాక రూ. 4.70 పైసలకు కొనుగోలు చేస్తుందన్నారు. సోలార్ పవర్ ప్రోత్సహించేందుకు ఎస్సీ, ఎస్టీలకు ఉచిత సోలార్ రూఫ్ టాప్‌లు, బీసీ వర్గాలకు కేంద్ర ప్రభుత్వం ఇచ్చే సబ్సిడీ మరో 20,000 అధికంగా కూటమి ప్రభుత్వం అందజేస్తుందన్నారు. రోజు రోజుకు మారుతున్న కాలానికి అనుగుణంగా కూటమి ప్రభుత్వం తక్కువ ధరకే విద్యుత్ కొనుగోలు చేస్తుందని ఎమ్మెల్యే చినరాజప్ప వివరించారు.

# హిందూ ధర్మ పరిరక్షణ కొరకు కృషి చేయాలి : శ్రీ పీఠం పరిపూర్ణానంద స్వామీజీ పిలుపు

**సామర్లకోట, (రాజధాని వార్తలు):** హిందూ ధర్మ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కాకినాడ శ్రీపీఠం పీఠాధిపతి పరిపూర్ణానంద స్వామీజీ పిలుపునిచ్చారు. రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ స్థాపించి నూరు వసంతాలు పూర్తయిన సందర్భంగా సామర్లకోట ప్రతిభ విద్యనికేతన్ పాఠశాల ప్రాంగణంలో హిందు సమ్మేళన సభ అత్యంత వైభవంగా జరిగింది. ఈ హిందూ ధర్మ సమ్మేళన సభలో పాల్గొన్న శ్రీ పీఠం (కాకినాడ) పీఠాధిపతి పరిపూర్ణానంద స్వామీజీ మాట్లాడుతూ హిందువులంతా ఐకమత్యంతో మెలగాలన్నారు. అతి ప్రాచీన హిందూ మతాన్ని వారసత్వ సంపదగా భావించాలన్నారు.

ప్రస్తుత తరుణంలో అనేక ఇతర మతాలు తమ మతాలను ప్రచారం చేసుకుని ముం దుకు వెళుతూ హిం దువులను ఆకర్షిస్తున్నాయన్నారు. హిందువులంతా ఐకమత్యంగా ఉండి ఇతర మతాల ప్రచారాల బారిన పడకుండా హిందూ మత పరిరక్షణకు బాధ్యత వహించాలన్నారు. హిందూ జాతి పరిరక్షణ కొరకు వంద సంవత్సరాల క్రితమే రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ (ఆర్ఎస్ఎస్) స్థాపించబడిందన్నారు. ఆనాడు స్థాపించిన ఆర్ఎస్ఎస్ ప్రస్తుతరణంలో దిగ్విజయంగా ముందుకు సాగడం ఎంతో ఆనందకరమన్నారు. రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ 100 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా రాష్ట్రీయ స్వయం సేవకు కార్యక్రమాలు ప్రతి ప్రాంతంలో దిగ్విజయంగా జరుగుతున్నాయన్నారు. ఈ హిందూ సమ్మేళనంలో కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన శ్రీ పీఠం పీఠాధిపతి పరిపూర్ణానంద సరస్వతీ స్వామితో పాటు అనేకమంది హిందూ ధర్మ రక్షణ కొరకు ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో కటకం రత్నం కుమారి, ప్రతిభ విద్యా నికేతన్ అధినేత ఎస్ వి వి జి ప్రకాష్ మరియు ప్రముఖ పారిశ్రామికవేత్త పసల పద్మరాఘవరావు. భయ్యా వాసు గుడివాడ కృష్ణాశ్రమం పీఠాధిపతి గవరసాని గోపాలకృష్ణ ప్రముఖులు బిక్కిన పరమేశ్వర సాయి సత్యనారాయణ ఆర్‌వి సుబ్బరాజు జీవీకే మోహన్ రావు కర్రి ఆదినారాయణ రెడ్డి కటకం సతీష్ కటకం బాబు కటకం హైమావతి తదితర హిందువులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# డ్రైవర్లు, క్లీనర్‌లకు వైద్య పరీక్షలు



**పెద్దాపురం, (రాజధాని వార్తలు):** పెద్దాపురం పట్టణంలో 37వ జాతీయ రహదారి భద్రత మాసోత్సవం కార్యక్రమాన్ని నిర్వహించారు. పెద్దాపురం మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్. ప్రసాద్ ఆధ్వర్యంలో స్టానిక పాండవుల మెట్ట వద్ద గల లారీ యూనియన్ ఆఫీసు వద్ద ఉచిత వైద్య శిభిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా లారీ డ్రైవర్లు వ్యాను డ్రైవర్లకు అవగాహన కల్పించారు. మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్ ప్రసాద్ అధ్యక్షత జరిగిన సదస్సుకు పెద్దాపురం సీఐ జయశంకర్, కాకినాడ జిల్లా అదనపు మోటార్ వెహికల్ ఇన్స్పక్టర్ హరినాథ్ రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. డ్రైవింగ్ సమ యంలో తీసుకోవలసిన జాగ్రత్తలపై వారు విపులీకరించారు. అనంతరం శ్రీ కిరణ్ కంటి ఆసుపత్రి, మెడికవర్ ఆసుపత్రి ఆధ్వర్యంలో డ్రైవర్లు, క్లీనర్లకు ఉచిత వైద్య శిభిరం నిర్వహించారు. సుమారు రెండు వందలకు పైగా డ్రైవర్‌లు, క్లీనర్‌లు వైద్య పరీక్షలు చేయించుకున్నారు. ఈ కార్యక్రమంలో లారీ యూనియన్ అధ్యక్షులు రవితో పాటు పెద్ద సంఖ్యలో యూనియన్ సభ్యులు పాల్గొన్నారు.

Printed & Published by Pattan Hussain Khan, on behalf of M/S Vastitude Media Pvt.Ltd; Printed at Jagathi Publications Ltd., Sakshi Press, Survey No. 766/2 Ankireddy Palem Village, Guntur Rural, Dist. Guntur-522005, AP; Published at 6-45/1, Thullur Mandal, Guntur Dt,AP-522237; RNI NO: APTEL/2019/77985, Whatsapp: 9440662699,Email: rajadhanivartalu@gmail.com | Web: rajadhanivartalu.com | Founding Editor: Pattan Hussain Khan